# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం 14 జనవరి 2025 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 8


## రంగవల్లికలతో ఆకట్టుకున్న చిన్నారులు



**నిజామాబాద్ ప్రతినిధి, జనవరి 13 (నినాదం న్యూస్) :** సంక్రాంతి పండగ అంటేనే మూడు రోజుల ముచ్చటైన పండగ మొదటి రోజున భోగి పండగగా జరుపుకుంటారు. ఈ భోగి పర్వదినం రోజున ప్రతి ఇంటి ముంగిళ్ళలో అందమైన రంగవల్లి కళ్ళతో మహిళామణులు, యువతులు, చిన్నారులు తమకు నచ్చిన ముగ్గులను రంగురంగులతో అద్ది ప్రతిభను చాటుకుంటారు. అయితే పాశ్చాత్య సంస్కృతికి అలబడుతున్న ప్రస్తుత కాలంలో నగరంలోని గంగస్థాన్ 1 లో ఓ అపార్ట్మెంట్లో నివాసముండే గౌతమ్ రెడ్డి, మేఘనల కుమార్తెలు అన్విత, ఆర్వి లు భోగి సందర్భంగా అపార్ట్మెంట్ కల్చర్కు భిన్నంగా ఉదయం లేచి నుంచే ఆ ఇద్దరు చిన్నారులు అందమైన రంగులతో కూడిన రంగవల్లికలు వేసి ఆకట్టుకున్నారు.



## ఊపందుకున్న..
# యాసంగి నాట్లు

2లో

### వరుసకట్టిన పొరుగు రాష్ట్రాల వలస కూలీలు

వానాకాలం ముగియడంతో రాష్ట్రంలోని పలుచోట్ల వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే కూలీల కోసం రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. ఒకప్పుడు గ్రామాల్లోని మహిళలు సందడిగా నాట్లు, కోతలు వంటి వ్యవసాయ పనుల్లో చురుగ్గా పాల్గొనేవారు. కానీ నేడు ఏ గ్రామంలో చూసినా ఈ దృశ్యం కనిపించడం లేదు..



### రాజీనామా చేసే దమ్ముందా?.. అని నిలదీసినందుకు
## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై 3 కేసులు నమోదు

**కరీంనగర్, జనవరి 13(నినాదం న్యూస్):** బీఆర్ఎస్ టికెట్పై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ని నీది ఏ పార్టీ.. రాజీనామా చేసే దమ్ముందా? అంటూ నిలదీసిన ఘటనలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్రెడ్డిపై మూడు కేసులు నమోదయ్యాయి. ఎమ్మెల్యే సంజయ్పై దురుసుగా ప్రవర్తించారని ఆయన పీఏ ఫిర్యాదు చేయడంతోపాటు సమావేశంలో గందరగోళం, పక్కదారి పట్టించారని ఆర్డీవో ఫిర్యాదు చేశారు. దీంతో కరీంనగర్లోని ఒకటో పట్టణ పోలీసులు వివిధ సెక్షన్ల కింద మూడు కేసులు నమోదుచేశారు. ఉమ్మడి కరీంగనర్ జిల్లా సమావేశం

మిగతా2లో

### బీఆర్ఎస్ కార్యకర్తలపై..
# పోలీసుల దాష్టికం



**హైదరాబాద్, జనవరి 13(నినాదం న్యూస్):** ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక విధానాలతో ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నది. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తున్నది. బీఆర్ఎస్ నాయకులపై దాడే ఇందకు ప్రత్యక్ష సాక్ష్యం. వివరాల్లోకి వెళ్తే..భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు మీద దాడికి నిరసనగా వినాయక చౌరస్తా వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ క్రమంలో వల్లపు విజయ్ ముదిరాజ్ అనే బీఆర్ఎస్ కార్యకర్తను పోలీసులు వాహనంలో బస్టాండ్ వరకు ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు. దీంతో ఆయన వెన్నుపూసకు గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. ఓ వైపు నిందితులకు రాచ మర్యాదలు చేస్తూ మరోవైపు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని కారులో రోడ్డు మీద ఈడ్చుకుంటూ తీసుకెళ్తున్న వైనంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం తన పనితీరును మార్చుకోవాలని బుద్ధి జీవులు హితవు పలుకుతున్నారు.

### రైతు భరోసా రూ.15,000 ఇవ్వాలని
# బీఆర్ఎస్ నిరసన



**ఆదిలాబాద్, జనవరి 13(నినాదం న్యూస్):** అధికారమే పరమావధిగా అమలకు సాధ్యంకాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న తీరుపై బీఆర్ఎస్ ఉద్యమ బాట పట్టింది. హామీల అమలు కోసం సబ్బండ వర్ణాలను కలుపుకొని కాంగ్రెస్ పాలనపై ఉద్యమిస్తున్నారు. తాజాగా..

మిగతా2లో

# ఊపందుకున్న యాసంగి నాట్లు..

## రైతు భరోసా రూ.15,000 ఇవ్వాలని బీఆర్ఎస్ నిరసన

(మొదటిపేజీ తరువాయి..)

రైతు భరోసా కింద రూ.15000 అందజేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో ఆందోళన చేపట్టారు. మాజీ మంత్రి జోగురామన్న ఆధ్వర్యంలో అదిలాబాద్ బస్టాండ్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన మాట తప్పి మోసం చేసిందని జోగు రామన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాడుతామన్నారు. కాగా, పోలీసులు శాంతియుతంగా నిరసన చేపడుతున్న జోగు రామన్న అడ్డుకున్నారు.

## మాజీ ఎంపీ జగన్నాథంకు కన్నీటి వీడ్కోలు







**మహేశ్వరం, జనవరి 13 (నినాదం న్యూస్)**
నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథం హైదరాబాద్ చంపాపేట్ డివిజన్ పరిధిలోని మాజీ ఎంపీ మందా జగన్నాథం అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా హైదరాబాద్ నిమ్స్ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. నాగర్ కర్నూల్ జిల్లా ఇటిక్యాల లో 1951 మే 22 న జన్మించిన జగన్నాథం నాలుగు పర్యాయాలు ఎంపీగా 2. 1996, 1999, 2004, 2009 విజయం సాధించారు. 3 సార్లు తెదేపా, ఒకసారి కాంగ్రెస్ తరపున గెలిచారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగానూ సేవలందించారు. లోక్సభ ఎన్నికలకు ముందు బీఎస్పీలో చేరారు. నాగర్ కర్నూలు జిల్లా మాజీ ఎంపీ మంద జగన్నాథం అంత్యక్రియలు యాకుత్ పురా నియోజకవర్గం సైదాబాద్ మండలం ఐ ఎస్ సదన్ డివిజన్ ధోభీఘాట్‌లో నిర్వహించారు. ఆయనకు భార్య మంద సావిత్రి, ఇద్దరు కుమారులు మంద రామేశ్వరిశ్రీనాథ్, మంద తేజస్విని విశ్వనాథ్, ఒక అమ్మాయి డాక్టర్ పల్లవి డాక్టర్ మురళీశ్వరరావు ఉన్నారు. ఈక్రమంలో ఆయన బంధువులు స్నేహితులు కళాకారుల అశ్రు నాయానాల మధ్య పార్థివ దేహాన్ని ధోబి ఘాట్ ఆవరణ శ్మాశానవాటికకు తరలించారు. తన భౌతిక కాయాన్ని పెద్ద సంఖ్యలో వచ్చి తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్, టి పి సి సి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర భారత్ గోర్ బంజారా సేవ సమితి చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ విస్లావత్ జగన్ నాయక్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మీర్ పేట్ మాజీ ఎంపీటీసీ జోజి, సీనియర్ నాయకులు పి. డేవిడ్, పార్టీ సీనియర్ నాయకులు మాడుగుల అంజయ్య, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ నరేష్ కుమార్, సంతోష్ నగర్ ట్రాఫిక్ సిఐ నరసింహా నాయక్ ఆదేశం మేరకు ఎస్సీలు సత్యనారాయణ వెంకటప్ప ట్రాఫిక్ పోలీసులు లా అండ్ ఆర్డర్ పోలీసులు అధికారులు పలువురు నాయకులు మంత్రులు ఉద్యోగస్తులు సిబ్బంది కుటుంబ సభ్యులు స్నేహితులు బంధువులు మిత్రులు భౌతిక కాయాన్ని దర్శించుకుని నివాళులర్పించారు. మాజీ ఎంపీ మంద జగన్నాథం తెలంగాణ ఉద్యమాల్లో వినలేని సేవలు చిరస్మరణీయమని అనుబంధాన్ని గుర్తు గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులు బంధువులు మిత్రులు వచ్చి అంత్యక్రియల కొనసాగించారు.

### • వరుసకట్టిన పొరుగు రాష్ట్రాల వలస కూలీలు



**ఖమ్మం, జనవరి 13(నినాదం న్యూస్):** ఖమ్మం జిల్లాలో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే నాటు వేసేందుకు కూలీలు మాత్రం దొరకడం లేదు. దీంతో రైతులు ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొచ్చి నాట్లు వేయిస్తున్నారు. పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిశా, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల నుంచి వస్తున్న కూలీలు ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో నెల పాటు ఇక్కడే ఉంటారు. ఆయా రాష్ట్రాల్లో పనులు సరిగ్గా దొరకకపోవడం, పని దొరికినా కూలి తక్కువగా ఉండడంతో తెలంగాణలో కూలి ఎక్కువగా ఉండటంతో ఉపాధి నిమిత్తం ఏటా ఇక్కడికి పెద్ద సంఖ్యలో కూలీలు వస్తుంటారు. తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి వనరులు పెరగడమేకాక భారీ వర్షాలతో జలవనరులు కళకళలాడుతున్నాయి. దీంతో చిన్న కమతాలు ఉండి నీటి వనరులులేని వ్యవసాయ కుటుంబాలు ఇప్పుడు సాగు చేసుకుంటున్నాయి. ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టుకుతోడు ఉమ్మడి జిల్లాలో ఇతర నీటి వనరుల ఆధారంగా సాగు ఏటేటా పెరుగుతోంది. ఫలితంగా స్థానికంగా కూలీల లభ్యత తగ్గడం, యంత్రాలు అందుబాటులోకి వచ్చినా అన్ని పనులు చేయలేని పరిస్థితి ఎదురవుతుండడంతో రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వరి నాట్లకు వినియోగంలోకి తీసుకొచ్చిన యంత్రాలు మెరుగైన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో రైతులు కూలీలపైనే ఆధారపడుతున్నారు. నేలకొండపల్లి మండలంలో వివిధ గ్రామాల్లో వరి నాట్లు వేసేందుకు పచ్చిమ బెంగాల్ నుంచి 40 మంది కూలీలు వచ్చారు. నాటు వేసినందుకు ఎకరానికి రూ.4,500 తీసుకుంటారు. ఇక్కడి రైతులు కుడా వారు చేసే పని మెచ్చుకుంటున్నారు. పచ్చిమ బెంగాల్ కూలీలు నాటు వేస్తే పంట ఎక్కువగా వస్తోందని చెపుతున్నారు. రోజువారీగా తీసుకునే కూలి తక్కువగా ఉండడమే కాక పని చకచకా పూర్తవుతుండడంతో రైతులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలతో వరి నాట్లు వేయించుకుంటున్నారు. మొత్తం 40 మంది ముఠాగా ఏర్పడి రోజుకు ఐదెకరాల్లో నాట్లు వేస్తున్నారు. ఎకరాకు రూ.4,500 చొప్పున తీసుకోవడంతో పాటు నారు కట్టలను కూడా వీరే మోస్తుండడంతో పని సులువవుతోంది. పశ్చిమబెంగాల్, బీహార్, ఒడిశా, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల నుంచి ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో కూలీలు ఇక్కడకు వచ్చి నెల పాటు రైతుల క్షేత్రాల వద్దే బస చేస్తున్నారు. వరి నాట్లే కాకుండా మిర్చి ఏరడం, ఇతర వ్యవసాయ పనులు కూడా చేస్తుండడంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వీరికి మంచి ఆదరణ లభిస్తోంది. ఇక్కడ నాట్లు పూర్తయ్యాక ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి తదితర జిల్లాలకు వెళ్తామని వలస కూలీలు చెబుతున్నారు.

### రాజీనామా చేసే దమ్ముందా?.. అని నిలదీసినందుకు

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై 3 కేసులు నమోదు

(మొదటిపేజీ తరువాయి..)



కరీంగనర్ కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతుండగా.. 'నువ్వు ఏ పార్టీ నుంచి మాట్లాడుతున్నవో చెప్పు.. పార్టీ మారిన నీకు మాట్లాడేహక్కు లేదు.. రాజీనామా చేసే దమ్ముందా?' అంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. 'నువ్వు బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్వార్థపరుడివి. నీకు ఇక్కడ మాట్లాడే అర్హత లేదు. ఏ పార్టీ నుంచి మాట్లాడుతున్నవో చెప్పాలి? అంటూ ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు నెట్టుకుంటూ దూషించుకున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీహెచ్ విజయరమణారావు, ఆది శ్రీనివాస్, డాక్డర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మక్కాన్‌సింగ్ ఠాకూర్ తదితరులు కౌశిక్‌రెడ్డిని అడ్డుకున్నారు. ఆయనను వేదికపై నుంచి కిందికి నెట్టే ప్రయత్నం చేశారు. దీంతో వేదికపైనే ఉన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు జోక్యం చేసుకుని కౌశిక్‌రెడ్డిని బలవంతంగా కలెక్టరేట్ ఆడిటోరియం నుంచి లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో కౌశిక్‌రెడ్డి తుల్లి వేదికపై ఉన్న కుర్చీలో పడిపోయారు. పోలీసులు బలవంతంగా ఎత్తుకెళ్లి ఆడిటోరియం బయట వదిలేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు, కౌశిక్‌రెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యే సంజయ్.. పాడి కౌశిక్‌రెడ్డి ఛాతీపై చేయి వేసి నెట్టేశారు.

**సంజయ్‌కి దమ్ముంటే రాజీనామా చేయాలి**

కేసీఆర్ పెట్టిన భిక్షతో ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు దమ్ముంటే రాజీనామా చేసి, కాంగ్రెస్ బీఫాంపై పోటీ చేసి గెలవాలని పాడి కౌశిక్‌రెడ్డి సవాలు చేశారు. తనపై కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్యం చేస్తున్నదని మండిపడ్డారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేనైన తనను మంత్రుల సాక్షిగా కరీంనగర్ సమీక్షా సమావేశం నుంచి బయటకు లాక్కొచ్చారని ఆరోపించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి, అమ్ముడుపోయిన జగిత్యాల ఎమ్మెల్యేను 'నీది ఏ పార్టీ?'అని అడిగితే.. 'కాంగ్రెస్ పార్టీ' అని చెప్తున్నాడని, అతనిపై స్పీకర్ అనర్హత వేటు వేయాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను విమర్శిస్తుంటే తాము చూస్తూ ఊరుకోలేమని స్పష్టంచేశారు. ఇలాంటి వారిని నిలదీస్తామని, అడుగడుగునా అడ్డుకుంటామని చెప్పారు. మూడేండ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారని, ఇప్పుడు అతిగా ప్రవర్తిస్తున్న ప్రతి ఒక్కరిపై చర్యలు తప్పవని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ మారిన ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. సంజయ్ రాజీనామా చేసే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని స్పష్టంచేశారు.

# వైభవంగా వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు

- వీరబోనం వెనుక భక్తుల ప్రదక్షణలు
- ఆకట్టుకున్న ఖడ్గ విన్యాసాలు





**భీమదేవరపల్లి జనవరి 13 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో సంక్రాంతి పర్వదినాన జరిగే వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారికి భోగి రోజు కుమ్మరుల వీర బోనంతో వీరభద్ర స్వామి గుడి చుట్టూ ప్రదక్షిణలు సోమవారం సాయంత్రం కుమ్మరి వాళ్లు శివసత్తులు వీర ఖడ్గాలతో విన్యాసాలు చేస్తూ,ఓం వీరభద్రాయ అంటూ కొత్తకొండ ఆలయం చుట్టూ ప్రదీక్షనులు చేశారు. కుమ్మరి వాళ్లందరూ తండోపతండాలుగా కుటుంబ సభ్యులందరూ వీర బోనం వెంబడి చుట్టూ తిరిగారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా, కార్యనిర్వహణాధికారి కిషన్ రావు పాలకమండలి ధర్మకర్తలు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పల్లెల్లో సందడి.. ఘనంగా భోగి వేడుకలు

**కోదాడ/అనంతగిరి, జనవరి 13 (నినాదం న్యూస్):**
సంక్రాంతి శోభతో తెలుగు లోగిళ్లు వెలుగులీనుతున్నాయి. భోగభాగ్యాల సంక్రాంతిని ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. పట్టణం నుంచి పల్లెకు చేరిన వారంతా వేకువజామునే లేచి భోగి మంటలు వేశారు. ఆటపాటలతో సందడి చేస్తున్నారు. అనంతగిరి మండలం ఖానాపురం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఉయ్యాల వీరయ్య గౌడ్ ఆధ్వర్యంలో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. జెర్రిపోతుల నాగేశ్వరరావు, ఉయ్యాల కాశయ్య ,సురుగాని శ్రీను, గుండు సురేష్ ,ఉయ్యాల నవీన్ మహిళలు పాల్గొన్నారు.



# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఇచ్చిమొచ్చినట్లు క్రియేట్

- ప్రముఖుల ఫొటోలను మార్ఫింగ్
- తాజాగా జాన్వీకపూర్, హార్దిక్‌పాండ్యా క్లోజ్‌గా ఉన్నట్లు వైరల్

**న్యూఢిల్లీ, జనవరి 13 (నినాదం న్యూస్):** ఆర్టిఫిషి యల్ ఇంటిలిజెన్స్ సాయంతో కొందరు ఇచ్చిమొచ్చినట్లుగా ప్రముఖుల ఫొటోలను మార్ఫింగ్ చేసి నెట్టింట్లో పోస్టు చేస్తున్నారు. దీంతో దానిని చూసిన నెటిజన్లు అది నిజమోనని ఆరా తీయడం మొదలు పెడుతున్నారు. ఇది ఈ మధ్యకాలంలో బాగా పెరిగింది. ఇందుకు ప్రధాన కారణంగా ఎఐ ఆర్టిఫిషియల్ ఇంకా మరింత అభివృద్ధి చెందటమే కారణంగా. ఈ నేపథ్యంలో క్రికెటర్ హార్దిక్ పాండ్యా, స్టార్ నటి జాన్వీ కపూర్ డేటింగ్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో తెగ ప్రచారం జరుగుతోంది. అందుకు కారణం ఇద్దరూ చనువుగా ఉన్న ఫొటోలు వైరల్ కావడమే. వీరిద్దరూ కలిసి ఇటీవలే మాల్దీవుల్లో విహరించినట్లు ఆ ఫొటోలను బట్టి తెలుస్తోంది. జాన్వీ-పాండ్యా సముద్ర తీరంలో విహరిస్తూ, సన్నిహితంగా కనిపించారు. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు హార్దిక్ జాన్వీ పీకల్లోతు ప్రేమలో ఉన్నారంటూ మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. దీంతో రంగంలోకి దిగిన నేషనల్ మీడియా ఫ్యాక్ట్ చెక్ నిర్వహించగా అసలు విషయం బయటపడింది. ఈ ఫొటోలు నిజం కాదని తేల్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో క్రియేట్ చేసినవిగా తేల్చింది. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ వచ్చిన వార్తలు కేవలం పుకార్లు మాత్రమే అని స్పష్టమైంది. కాగా, హార్దిక్ పాండ్యా ఇటీవలే తన భార్య నటాషా స్టాంకోవిక్‌తో విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం తన దృష్టిమొత్తం కెరీర్‌పైనే పెట్టాడు. ఇక జాన్వీ కపూర్ వరుస బాలీవుడ్ ప్రాజెక్టులతోపాటు టాలీవుడ్ సినిమాలతో బిజీగా మారిపోయింది.

# మహా కుంభమేళా వద్ద ములాయం సింగ్‌యాదవ్ విగ్రహం

- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సాధవులు
- విమర్శలు ఎదుర్కొంటున్న సమాజ్‌వాద్ పార్టీ



**లక్నో, జనవరి 13(నినాదం న్యూస్):** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద మహా కుంభమేళా సోమవారం ఉదయం ప్రారంభమైంది. ఈ కుంభమేళాలో యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు ములాయం సింగ్ యాదవ్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ విగ్రహాన్ని ప్రతిష్టించడంతో సమాజ్‌వాదీ పార్టీ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటుంది. ములాయం విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో సాధువులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ములాయం సింగ్ యాదవ్ స్మృతి సేవా సంస్థాన్ సెక్టార్ 16లోని శిబిరంలో ఏర్పాటు చేశారు. రెండు నుంచి మూడు అడుగుల ఎత్తులో ఉన్న ములాయం విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించినట్లు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు మాతా ప్రసాద్ పాండే ఆదివారం తెలిపారు. అయితే ములాయం విగ్రహా ఏర్పాటును అఖిల భారతీయ అఖార పరిషత్ తీవ్రంగా విమర్శించారు. పరిషత్ అధ్యక్షుడు మహంత్ రవీంద్ర పూరి మాట్లాడుతూ.. ములాయం సింగ్ యాదవ్ హిందూ వ్యతిరేకి అని మండిపడ్డారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ఆయన పని చేశారని విమర్శలు గుప్పించారు. ములాయం విగ్రహం ఏర్పాటుకు మేం వ్యతిరేకం కాదు.. ఆయన యూపీకి సీఎంగా పని చేశారు. కానీ మహా కుంభమేళాలో ములాయం విగ్రహాన్ని ప్రతిష్టించడం సరికాదు. ఈ విగ్రహా ఏర్పాటుతో యూపీలో ఆయన చేసిన అరాచకాలు, అల్లర్లు, మతవిద్వేషాలు గుర్తుకు వచ్చేలా ఉందన్నారు. ఈ దేశ ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు ఎస్పీ నేతలు. రామమందిర ఉద్యమంలో ఆయన సహకారం ఏమిటో అందరికీ తెలుసు. ఆయన ఎప్పుడూ హిందూ వ్యతిరేకి, సనాతన ధర్మానికి వ్యతిరేకి, ముస్లింలకు అనుకూలంగా ఉండేవారు అని రవీంద్ర పూరి పేర్కొన్నారు.

# చిన్నపిల్లలతో వచ్చేవారు జాగ్రత్తగా ఉండాలి : ఏసీపీ తిరుమల్



**భీమదేవరపల్లి జనవరి 13 (నినాదం న్యూస్) :** కొత్తకొండ జాతరకు చిన్నపిల్లలతో వచ్చే భక్తులు జాగ్రత్తగా ఉండాలని కాజీపేట ఏసిపి తిరుమల్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి జాతరలో సంక్రాంతి పండుగ రోజు వీరభద్ర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో కొక్కుల హర్షిత్ ములుగు వెంకటాపూర్ కు చెందిన బాబు తప్పిపోవడంతో అతని గుర్తించి వారి తండ్రి విష్ణు కు ఏసిపి తిరుమల్, సీఐ రమేష్ ఆధ్వర్యంలో అప్పగించడం జరిగింది. బాలుడు తల్లిదండ్రులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

# కొత్తకొండలో వీఐపీ దర్శనాలు లేవు

- ఇబ్బందులు లేకుండా దర్శనాలు



**భీమదేవరపల్లి జనవరి 13 (నినాదం న్యూస్):** హన్మకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలం లో ని కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో భాగంగా కాజిపేట్ ఎసిపి తిరుమల్ , ఎల్కతుర్తి సీ ఐ పులి రమేష్ ఆధ్వర్యంలో భారీ బందబస్తు నడుమ భక్తులకు ఎలాంటి యిబ్బంది లేకుండా దర్శనాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సి ఐ పులి రమేష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు క్యూ లైన్ పాటించాలని,ఎక్కడ ఎలాంటి విఐపి దర్శనాలు ఉండవని అందరు 200 రూపాయల టికెట్ కొనుకొని దర్శనం చేసుకోవాలని అన్నారు. ,ఏసీపీ ని కూడా క్యూ లైన్లోనే 200 రూపాయలు టికెట్ కొనుక్కొని దర్శనం చేసుకున్నామని తెలిపారు. కావున భక్తులందరు అందుకు సహకరించాలని వారు కోరారు.

# అంబరాన్నింటిన బోగి సంబురాలు



**చేవెళ్ల జనవరి 13( నినాదం న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. మూడు రోజుల వేడుకల్లో భాగంగా తొలి రోజు భోగి పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. పల్లెలు, పట్నాలు అన్న తేడా లేకుండా జనం పొద్దున్నే లేచి భోగి మంటలు వేసుకున్నారు. తమ లోగిళ్ల ముందు భోగి మంటల కాంతులు విరజిమ్మాయి. ఆ తర్వాత తమ ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేస్తూ సందడి చేశారు.

# కుంభమేళాకు హాజరైన ఆపిల్ సహ వ్యవస్థాపకులు దివంగత స్టీవ్ జాబ్స్ భార్య

**ప్రయాగ్‌రాజ్, జనవరి 13(నినాదం న్యూస్):** ఆపిల్ సహ వ్యవస్థాపకులు దివంగత స్టీవ్ జాబ్స్ భార్య, ప్రపంచంలో అత్యంత ధనవంతురాలైన మహిళల్లో ఒకరైన లారెన్ పావెల్ మహా కుంభమేళాకు హాజరయ్యారు. 40 మంది సభ్యులతో కూడిన బృందంతో ఆమె ఉత్తరప్రదే శ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు తరలివచ్చారు. రెండు రోజుల క్రితమే (ఈ నెల 11న) భారత్‌కు చేరుకున్న 61 ఏండ్ల లారెన్.. నిరంజని అఖాడాకు చెందిన ఆచార్య మహామండలేశ్వర్ స్వామి కైలాషానంద శిబిరంలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన ఆమెకు శిబిరం వద్ద స్వామీజీలు ఘనంగా స్వాగతం పలికారు. లేత పసుపు వర్ణంలో వస్త్రాలు ధరించిన లారెన్.. చేతికి రక్షా సూత్ర, మెడలో రుద్రాక్ష మాల ధరించి ఉన్నారు. ఆమె ఈ నెల 15 వరకు అక్కడే ఉంటారు. అనంతరం నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొనేందుకు అమెరికాకు తిరిగి వెళ్లనున్నారు. ప్రయాగ్‌రాజ్ రావడానికి ముందు వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయాన్ని సందర్శించారు. లారెన్ పావెల్.. ప్రపంచంలోని అత్యంత సంపన్న మహిళల్లో ఒకరు. ఆమె ఆస్తి 15 బిలియన్ల డాలర్లు. స్టీవ్ జాబ్స్ భార్య అయిన లారెన్ పావెల్ యాపిల్ కంపెనీ షేర్స్ నుంచి ఆస్తిని వారసత్వంగా పొందారు. 2021లో ఆమె వేవెర్లీ స్ట్రీట్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. దీనికి వచ్చే నిధులను పర్యావరణ మార్పులను పరిష్కరించేందుకు కేటాయిస్తున్నారు. ఆపిల్ వ్యవస్థాపకుల్లో ఒకరైన స్టీవ్ జాబ్స్ 2011, అక్టోబర్ 5న మరణించిన విషయం తెలిసిందే.

# యూపీకి కాసులు కురిపించనున్న కుంభమేళా

**- దాదాపు రూ.2 లక్షల కోట్లు వచ్చే అవకాశం**

**ప్రయాగ్‌రాజ్, జనవరి 13(నినాదం న్యూస్):** ఉత్తరప్రదేశ్‌లో మహా కుంభమేళా ప్రారంభమైంది. తొలి రోజు ఉదయం గంగా , యమునా, సరస్వతి నదులు కలిసిన త్రివేణి సంగమం వద్ద దాదాపు 50 లక్షల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు చేశారు. ప్రపంచంలోనే అత్యధిక మంది సమ్మేళనమైన కార్యక్రమంగా ఈ మహా కుంభమేళా రికార్డుల్లోకి ఎక్కనుంది. ఈ కుంభమేళాకు దాదాపుగా 45 కోట్ల మందికిపైగా భక్తులు తరలివస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఇది అమెరికా, రష్యా దేశాల జనాభా కంటే కూడా ఎక్కువ కావడం గమనార్హం. కుంభమేళా ప్రతి పన్నేండేళ్లకు ఒకసారి జరుగుతుంది. అయితే ఇప్పుడు జరిగేది మహా కుంభమేళా. ఈ మహా కుంభమేళా 144 ఏళ్లకు ఒకసారి జరుగుతుంది. ఇవాళ ప్రారంభమైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. ఈ మహా కుంభమేళా ఉత్తరప్రదేశ్ సర్కారుకు ఆర్థికంగా ఎంతో బలోపేతం చేయనుంది. ఈ 45 రోజుల మహా కుంభమేళా నిర్వహణ కోసం యూపీ సర్కారు రూ.7 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. అయితే మహా కుంభమేళాకు రూ.7 వేల కోట్లు ఖర్చు చేస్తే.. యూపీకి ఆదాయం రూపంలో దాదాపు రూ.2 లక్షల కోట్లు వచ్చే అవకాశం ఉన్నదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ భక్తులు 45 కోట్ల మంది రాకపోయినా 40 కోట్ల మందే వచ్చినా.. ఒక్కో భక్తుడు రూ.5 వేల చొప్పున ఖర్చు చేసినా రాష్ట్రానికి రూ.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉన్నదని వారు చెబుతున్నారు. ఇక భక్తులు రూ.10 వేల చొప్పున ఖర్చు చేస్తే మొత్తం రూ.4 లక్షల కోట్ల ఆదాయం సమకూరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని తెలిపారు. కాగా 2019లో జరిగిన అర్ధ కుంభమేళా ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరినట్లు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చెప్పారు. ఆ కుంభమేళాకు 24 కోట్ల మంది భక్తులు వచ్చారు. ఐదేళ్ల క్రితం 24 కోట్ల మంది భక్తులు వస్తేనే రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం వచ్చినప్పుడు.. ఈసారి 40 కోట్ల మంది కంటే ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున రూ.2 లక్షల కోట్ల ఆదాయం రావడం అసాధ్యమేమీ కాదని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో భోగి వేడుకలు

**- భోగిమంటలు వేసిన మంత్రులు**

**హైదరాబాద్/విజయవాడ, జనవరి13(నినాదం న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లో భోగి వేడుకలు సంబరంగా సాగాయి. వేకువ జామునే భోగిమంటలు వేశారు. ముందర భోగి మంటలు మండుతున్నాయి. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఆ వీధిలోని వారందరూ తమతమ ఇళ్ళ ముందర భోగీ మంటలు వేసి, వాటి చుట్టూ కూర్చుని సంతోషంగా కబుర్లు చెప్పుకుంటూ చలి కాచుకున్నారు. బంధాలను చిక్కపరుస్తాయి. జ్ఞాపకాలను పదిలపరుస్తాయి. భోగము అంటే ఆనందం. భోగము అంటే సంతోషం. బాధలకు స్వస్తి పలికి, ఆనందాలను ఆహ్వానించడమే భోగి పండగ పరమార్థం. అందుకే మనకు భారంగా ఉండే అవసరం లేని, ఉపయోగం లేని వస్తువులను భోగి మంటల్లో పడేస్తాం. ప్రకాశం జిల్లా టంగుటూరు తూర్పునాయుడుపాలెంలోని తన నివాసంలో భోగి వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ భోగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను కుటుంబ సభ్యులతో ప్రతి ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలి. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. సంక్రాంతి కానుకగా ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు, చిరు వ్యాపారులకు, కాంట్రాక్టర్లు, పోలీసు సిబ్బందికి బకాయిలు రూ.6,700 కోట్లు విడుదల చేశామన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కార్యాలయంలో సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన నాదెండ్ల మనోహర్ కు జనసేన వీరనారిమణులు స్వాగతం పలికారు. స్థానిక జనసేన తెనాలి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి ఉత్సవాల్లో చిన్నారులతో కలిసి సోమవారం భోగిమంటలు వెలిగించారు.సంక్రాంతి భోగి పండుగ పురస్కరించుకొని సోమవారం కదిరి పట్టణం హిందూపూర్ రోడ్డు లోని శ్రీలక్ష్మీ నరసింహ నగర్ లోని సుమారు 30 కుటుంబాలు వేకువజామున ఒక చోటికి చేరుకుని భోగి మంటలు వేసి సంక్రాంతి ముగ్గులు వేసి, భోగి మంటను వెలిగించి మహిళలు పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొని నృత్యాలు చేస్తూ పల్లెటూరి సంప్రదాయ వాతావరణంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు.

# రోడ్డు భద్రత గురించి తెలుసుకోండి

**- వాహనదారులకు మంత్రి సీతక్క హెచ్చరిక**

**ఆసిఫాబాద్, జనవరి13(నినాదం న్యూస్):** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో స్త్రీ– శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు భద్రత గురించి తెలుసుకోవాలి అన్నారు. బీర్లకు, బార్లలో ఖర్చు చేస్తున్నారు.. కానీ ప్రాణానికి రక్షణనిచ్చే హెల్మెట్ కోసం మాత్రం ఖర్చు చేయడం లేదని వాపోయారు. జిల్లాలో గత ఏడాదిలో 213 మంది చనిపోయారు.. మనతో పాటు మనల్ని నమ్ముకున్న వాళ్లు ఉంటారు.. అందుకే రోడ్డు భద్రత ప్రతి ఒక్కరు పాటించాలని మంత్రి సీతక్క తెలిపారు. ఇక, వాహనాలు ఎక్కి డ్రైవింగ్ చేసేటప్పుడు మద్యం సేవించరాదు.. సెల్ ఫోన్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేయరాదు అని సీతక్క సూచించారు. అలాగే, ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని వెల్లడించింది. శిరస్త్రం లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, మితిమీరి వేగంతో వెళ్లరాదు అని పేర్కొన్నారు. దీంతో పాటు వాహనదారులు రోడ్డు మీదకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాలు తగ్గిపోతాయని మంత్రి సీతక్క చెప్పారు.

## మాజీ సీఎం జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు

**అమరావతి, జనవరి13 (నినాదం న్యూస్):** ఈ పండుగ అందరి కుటుంబాల్లో భోగభాగ్యాలు నింపాలి' అని వైసీపీ అధినేత వైఎస్.జగన్ ఆకాంక్షించారు. నేడు భోగి పండుగను పురస్కరించుకొని ? వైఎస్.జగన్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తెలుగు ప్రజలకు సంక్రాంతి శు భాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి కుటుంబాల్లో భోగ భాగ్యాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. 'తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి. ఈ పండుగ అందరి కుటుంబాల్లో భోగ భాగ్యాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు ' అని చెప్పారు.

## ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డిపై మూడు కేసులు నమోదు

**కరీంనగర్, జనవరి 13(నినాదం న్యూస్):** బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి పండుగపూట బిగ్ షాక్ తగిలింది. ఆయనపై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. కరీంనగర్ వన్ టౌన్ పీఎస్‌లో ఈ కేసులు నమోదు అయ్యాయి. కరీంనగర్ ఆర్డీవో, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పీఏల ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ యాక్టు 132, 115 (2), 352,292 కింద కేసులు నమోదు అయ్యాయి. మరో ఫిర్యాదు ఆధారంగా 126 (2),115(2) పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, సంజయ్ కొట్టుకున్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లా సమీక్షా సమావేశంలో ప్రభుత్వ పథకా లపై చర్చ జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సహా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యా రు. ఎమ్మెల్యే సంజయ్ మైక్ తీసుకుని మాట్లాడే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన కౌశిక్ రెడ్డి నువ్వు ఏ పార్టీ అంటూ సంజయ్‌ను ప్రశ్నించారు. దమ్ముంటే కాంగ్రెస్ టికెట్‌పై గెలవా లని సవాల్ చేశారు. దీంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. వాగ్వా దం కాస్తా ముది రి ఇద్దరూ ఒకరిపై మరొకరు చేయి చేసుకున్నారు. మం త్రుల ఎదుటే కొట్టుకున్నారు. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు కౌశిక్ రెడ్డిని కలెక్టరేట్ నుంచి బలవంతంగా బయటకు లాక్కెళ్లారు. వివా దం నేపథ్యం లో అక్కడంతా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. కాగా, బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా మాట్లాడడం ఏంటని కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. మరోవైపు కౌశిక్ రెడ్డి ఎక్కడుంటే అక్కడ వివాదాలు ఉంటాయని కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# లాస్ ఎంజిల్స్‌లో అదుపులోకి రాని కార్చిచ్చు

**లాస్‌ఏంజిల్స్, జనవరి13 (నినాదం న్యూస్):** అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో కార్చిచ్చు వ్యాప్తి కొనసాగుతోంది. వేగంగా వీస్తున్న గాలులతో మంటలు కొత్త ప్రాంతాలకు వ్యాపిస్తున్నాయి. దీంతో వేలాది ఇండ్లు కాలి బూడిదవుతున్నాయి. లక్షల కోట్ల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లుతోంది. ప్రాణనష్టం సైతం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం.. కార్చిచ్చులో మరణించిన వారి సంఖ్య 24కు పెరిగింది. మరణించిన వారిలో అత్యధికంగా ఏటోన్స్ ఫైర్‌లోనే 16 మంది కాగా, పాలిసేడ్స్‌లో 8 మంది ఉన్నారు. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇక ఈ అగ్ని ప్రమాదాల్లో సుమారుగా 16 మంది తప్పిపోయినట్లు స్థానిక మీడియా నివేదించింది. మంటల ధాటికి ఇప్పటి వరకూ 12,000 నిర్మాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అంతేకాదు, పాలిసేడ్స్‌లో 23,707, ఏటోన్‌లో 14,117ఎకరాలు, కెన్నెత్‌లో 1,052, ముర్సెట్‌లో 779 ఎకరాలు దగ్ధమైనట్లు పేర్కొంది. మంటలను ఆర్పేందుకు కాలిఫోర్నియాతో పాటు అమెరికాలోని తొమ్మిది నగరాలు, మెక్సికోకు చెందిన అగ్నిమాపక బృందాలు పని చేస్తున్నాయి. కాగా, లాస్ ఏంజెల్స్‌లో నివసించే హాలీవుడ్ నటులు వారికి కేటాయించిన నీటి కంటే ఎక్కువ వినియోగించుకున్నారని, దీంతో ఇప్పుడు మంటలను ఆర్పేందుకు నీటి కొరత ఏర్పడిందని మర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా చరిత్రలోనే ఇది అత్యంత వినాశకరమైన ప్రకృతి వైపరీత్యమని కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసోమ్ అన్నారు. కార్చిచ్చు కొత్త ప్రాంతాలకు వ్యాపిస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. ప్రస్తుతం పాలిసేడ్స్ అగ్ని బ్రెంట్‌వుడ్ వైపు మళ్లింది. ఈ ప్రాంతంలో అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌తో పాటు పలువురు క్రీడాకారులు, నటీనటుల ఇండ్లు ఉన్నాయి. దీంతో ఉపాధ్యక్షురాలి హోదాలో చేయాల్సిన తన చివరి విదేశీ పర్యటనను కమలా హారిస్ రద్దు చేసుకున్నారు. మరోవైపు అమెరికాలోని టెక్సాస్, ఓక్లహోమా, మరికొన్ని రాష్ట్రాలను మంచు తుఫాను అతలాకుతలం చేస్తున్నది.లాస్ ఏంజెలెస్‌లోని కార్చిచ్చుల వ్యాప్తి కొనసాగుతూనే ఉంది. కొన్ని చిన్న మంటలను అదుపు చేసినా.. పాలిసేడ్స్, ఏటోన్ ప్రాంతాల్లో వ్యాపించిన మంటలను మాత్రం పూర్తిస్థాయిలో అదుపు చేయలేకపోతున్నారు. మరోవైపు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కాల్చిన బాణాసంచాతోనే ఇది మొదలైనట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటివరకు ఈ అగ్ని ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య 24కు చేరింది. అత్యధికంగా ఏటోన్ ఫైర్‌లోనే 16 మంది ప్రాణాలు కోల్పోగా.. పాలిసేడ్స్‌లో 8 మంది మరణించారు. ఈ సంఖ్య మరింత పెరగవచ్చని అధికారులు చెబుతున్నారు. అగ్నికీలల వ్యాప్తిని నెమ్మదింపజేయడానికి కొన్ని రసాయనాలు కలిపిన ఫోస్ చెక్ అనే మిశ్రమాన్ని దాదాపు 9 విమానాలు, 20 హెలికాప్టర్ల సాయంతో నగరంపై వెదజల్లుతున్నారు. పింక్ రంగులో ఉన్న ఆ పదార్థం అక్కడి నిర్మాణాలు, మొక్కలపైనా అవి పడి అగ్నికీలల వ్యాప్తిని నెమ్మదింపజేస్తుంది. దీనిలోని అమ్మోనియం పాలీఫాస్ఫేట్ అంతవేగంగా ఆవిరి కాదు. దేనిమీదైనా పడితే సుదీర్ఘకాలం ఉండిపోతుంది. ఇది వృక్షాలపై పడి.. అగ్నికి ఆక్సిజన్ అందకుండా చేయడంతో అవి వేగంగా వ్యాపించలేవు. లాస్ ఏంజెలెస్‌లో అతిపెద్దదైన పాలిసేడ్స్ ఫైర్ కారణం న్యూఇయర్ వేడుకలని అనుమానిస్తున్నారు. నూతన సంవత్సర సందర్భంగా కాల్చిన టపాసులతో అంటుకొని అక్కడ అగ్నిప్రమాదం జరిగింది. దానిని ఆర్పినా.. మిగిలిన నిప్పునకు బలమైన గాలులు తోడు కావడంతో కార్చిచ్చు రాజుకొన్నట్లు అనుమానిస్తున్నారని వాషింగ్టన్ పోస్టు కథనంలో పేర్కొంది. ఉపగ్రహ చిత్రాలు, రేడియో కమ్యూనికేషన్లు, స్థానికులను ఇంటర్వ్యూ చేసిన అనంతరం పాలిసేడ్స్ ఫైర్ అక్కడే మొదలైందని ఆ పత్రిక చెబుతోంది. సంపన్న ప్రాంతమైన పాలిసేడ్స్ సహా ఇతర ప్రాంతాల్లో విలువైన వస్తువులను వదిలేసి చాలా ఇళ్లు ఖాళీ చేశారు. దొంగలకు అవే లక్ష్యంగా మారుతున్నాయి. ఇప్పటివరకు 29 మంది దొంగలను అరెస్టు చేసినట్లు లాస్ ఏంజెలెస్ కౌంటీ షరీఫ్ రాబర్ట్ లూనా వెల్లడించారు. వీరిలో ఒకరు ఏకంగా అగ్నిమాపక సిబ్బంది దుస్తుల్లో అక్కడ సంచరిస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఖాళీ ఇళ్లను కాపాడేందుకు 400 మంది నేషనల్ గార్డ్స్‌ను ఇక్కడ మోహరించారు. ఇక ఇటీవల కెన్నెత్ ఫైర్‌ను అంటించినట్లు అనుమానిస్తున్న వ్యక్తి మెక్సికో నుంచి వచ్చిన అక్రమ వలసదారుడిగా గుర్తించారు. అతడి నుంచి బ్లోటార్చ్‌ను కూడా స్వాధీనం చేసుకొన్నట్లు అధికారులు పేర్కొన్నారు. తాజాగా ఓ డ్రోన్ సూపర్ స్కూపర్‌ను ఢీకొంది.

# శరీరంలో శక్తి సన్నగిల్లుతుందా..?

శరీరానికి తక్షణ శక్తిని అందించే పండ్లు అనేకం ఉన్నాయి. ఆధునిక జీవనశైలిలో అలసట, నీరసం సర్వసాధారణం. ఇలాంటి సమయంలో కొన్ని రకాల పండ్లను తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. పండ్లలో సహజ చక్కెరలు, విటమిన్లు, ఖనిజాలు , యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి కావాల్సిన శక్తిని అందించే వాటిల్లో జర్జూరం ఒకటి. ఖర్జూరం ఒక పోషకమైన పండు. ఇది శక్తిని పెంచడానికి, ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేయడానికి సహాయపడుతుంది. ఖర్జూరంలో సహజ చక్కెరలు, విటమిన్లు, ఖనిజాలు మరియు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ఖర్జూరంలోని పోషకాలు: ఖర్జూరంలో అనేక పోషకాలు ఉంటాయి, ఇవి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ముఖ్యంగా గ్లూకోజ్, ఫ్రక్టోజ్ మరియు సుక్రోజ్ వంటి సహజ చక్కెరలు ఖర్జూరంలో పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ఖర్జూరంలో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను




మెరుగుపరచడానికి , మలబద్ధకాన్ని నివారించడానికి సహాయపడుతుంది. దీనిలోని అనేక రకాల విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరంలోని వివిధ జీవక్రియలకు అవసరం. పొటాషియం, మెగ్నీషియం, కాపర్, మాంగనీస్ , ఐరన్ వంటి ఖనిజాలు ఖర్జూరంలో ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యం, నరాల పనితీరు మరియు రక్త ఉత్పత్తికి అవసరం. ఫ్లేవనాయిడ్లు, కెరోటినాయిడ్లు మరియు ఫినోలిక్ ఆమ్లాలు వంటి యాంటీఆక్సిడెంట్లు ఖర్జూరంలో ఉంటాయి. ఇవి కణాలను నష్టం నుండి రక్షిస్తాయి. ఖర్జూరం తింటే శక్తి ఎలా వస్తుంది? ఖర్జూరంలో ఉండే సహజ చక్కెరలు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ఇవి సులభంగా జీర్ణమై రక్తంలోకి త్వరగా చేరుతాయి. దీనివల్ల వెంటనే శక్తి లభిస్తుంది. వ్యాయామం చేసే ముందు లేదా తరువాత ఖర్జూరం తినడం వల్ల శక్తి లభిస్తుంది . అలసట తగ్గుతుంది. ఖర్జూరం యొక్క ఆరోగ్య ప్రయోజనాలు: శక్తిని పెంచడంతో పాటు, ఖర్జూరం అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. ఖర్జూరంలో ఉండే కాల్షియం, మెగ్నీషియం మరియు ఇతర ఖనిజాలు ఎముకలను బలంగా ఉంచడానికి సహాయపడతాయి. ఇది బోలు ఎముకల వ్యాధిని నివారించడానికి కూడా ఉపయోగపడుతుంది. ఖర్జూరంలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది , మలబద్ధకాన్ని నివారిస్తుంది. గుండె ఆరోగ్యం: ఖర్జూరంలో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడానికి మరియు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఖర్జూరంలో ఐరన్ ఉంటుంది, ఇది రక్తహీనతను నివారించడానికి సహాయపడుతుంది. ఖర్జూరంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు మెదడు పనితీరును మెరుగుపరచడానికి సహాయపడతాయి. ఖర్జూరంలో విటమిన్ సి , ఇతర యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి, ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. ఖర్జూరాన్ని నేరుగా తినవచ్చు. పాలతో కలిపి తీసుకోవచ్చు. స్మూతీస్‌లో కూడా కలుపుకోవచ్చు. ఇతర డెజర్ట్‌లలో కూడా ఉపయోగించవచ్చు. వ్యాయామం చేసే ముందు లేదా తరువాత ఖర్జూరం తినడం వల్ల శక్తి లభిస్తుంది. ఉదయం పూట ఖర్జూరం తినడం వల్ల రోజంతా శక్తివంతంగా ఉంటారు. ఆకలిగా ఉన్నప్పుడు లేదా నీరసంగా ఉన్నప్పుడు ఖర్జూరం తినడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. రోజుకు 3-4 ఖర్జూరాలు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. అధికంగా తీసుకుంటే క్యాలరీలు మరియు చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. అయితే మధుమేహం ఉన్నవారు ఖర్జూరాన్ని మితంగా తీసుకోవాలి. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యుడిని సంప్రదించి తగిన సలహా తీసుకోవాలి. ఖర్జూరం ఒక పోషకమైన మరియు శక్తినిచ్చే పండు. దీన్ని మీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా మీరు మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

# నోటి దుర్వాసనకు గల కారణాలు



నోటి దుర్వాసనకు అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో కొన్ని సాధారణమైనవి, మరికొన్ని తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతాలు కూడా నోటి దుర్వాసనకు కారణం అవుతాయి. సరిగ్గా బ్రష్ చేయకపోవడం, ఫ్లాస్ చేయకపోవడం వల్ల ఆహార పదార్థాలు నోటిలో ఉండిపోతాయి. ఇవి బ్యాక్టీరియాకు ఆహారంగా మారి దుర్వాసనను కలిగిస్తాయి. నాలుకను శుభ్రం చేయకపోవడం వల్ల కూడా దుర్వాసన వస్తుంది, ఎందుకంటే బ్యాక్టీరియా నాలుక వెనుక భాగంలో పేరుకుపోతుంది. లాలాజలం నోటిని శుభ్రంగా ఉంచడంలో సహాయపడుతుంది. లాలాజలం తక్కువగా ఉత్పత్తి అయినప్పుడు, నోరు పొడిబారుతుంది. దీనివల్ల బ్యాక్టీరియా వృద్ధి చెంది దుర్వాసన వస్తుంది. కొన్ని మందులు, ఆరోగ్య పరిస్థితులు మరియు వృద్ధాప్యం వల్ల నోరు పొడిబారవచ్చు. ఉల్లిపాయలు, వెల్లుల్లి, కొన్ని రకాల సుగంధ ద్రవ్యాలు వంటి ఆహారాలు నోటి దుర్వాసనకు కారణమవుతాయి. ఈ ఆహారాలు జీర్ణమైన తర్వాత, వాటి వాసన ఊపిరితిత్తుల ద్వారా బయటకు వస్తుంది. దంత క్షయం, చిగుళ్ల వ్యాధి, దంతాల మధ్య ఆహారం చిక్కుకుపోవడం వంటి సమస్యలు నోటి దుర్వాసనకు కారణమవుతాయి. సిగరెట్లు, చుట్టలు మరియు పొగాకు నమలడం వల్ల నోటి దుర్వాసన వస్తుంది. పొగాకు నోటిని పొడిబారుస్తుంది మరియు చిగుళ్ల వ్యాధికి దారితీస్తుంది. కొన్ని వైద్య పరిస్థితులు కూడా నోటి దుర్వాసనకు దారితీస్తాయి. వాటిలో సైనస్‌లలో ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు, ముక్కు మరియు గొంతులో శ్లేష్మం పేరుకుపోతుంది. ఇది దుర్వాసనకు కారణమవుతుంది. టాన్సిల్స్‌పై చిన్న రంధ్రాలలో ఆహారం మరియు ఇతర పదార్థాలు చిక్కుకుపోయినప్పుడు, టాన్సిల్ స్టోన్స్ ఏర్పడతాయి. ఇవి దుర్వాసనకు కారణమవుతాయి. గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ డిసీజ్ వంటి జీర్ణ సమస్యలు కడుపులోని ఆమ్లాలు అన్నవాహికలోకి తిరిగి రావడానికి కారణమవుతాయి. ఇది నోటి దుర్వాసనకు దారితీస్తుంది. నియంత్రించబడని మధుమేహం ఉన్నవారిలో, కీటోన్లు ఉత్పత్తి అవుతాయి. ఇవి నోటి దుర్వాసనకు కారణమవుతాయి. ఈ వ్యాధులు శరీరంలోని వ్యర్థాలను తొలగించే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి. ఇది నోటి దుర్వాసనకు దారితీస్తుంది. నోటి దుర్వాసన లక్షణాలు: నోటి దుర్వాసన యొక్క ప్రధాన లక్షణం నోటి నుండి దుర్వాసన రావడం. ఇతర లక్షణాలు కారణంపై ఆధారపడి ఉంటాయి. కొన్నిసార్లు, వ్యక్తులు తమ సొంత దుర్వాసనను గుర్తించలేకపోవచ్చు. దీనిని దంతవైద్యుడు నోటి దుర్వాసనను నిర్ధారించగలరు. వారు మీ వైద్య చరిత్ర, ఆహారపు అలవాట్లు, నోటి పరిశుభ్రత గురించి ప్రశ్నలు అడుగుతారు. వారు మీ నోరు మరియు దంతాలను కూడా పరీక్షిస్తారు. కొన్నిసార్లు, అంతర్లీన ఆరోగ్య సమస్యలను గుర్తించడానికి అదనపు పరీక్షలు అవసరం కావచ్చు. నోటి దుర్వాసన చికిత్స – నివారణ: %శీబ మీుఎాశ్రీంశీ ాఅఎవ% " సంక్రాంతి పండుగ పిండివంటలు అతిగా తింటున్నారా? జాగ్రత్త!" నోటి దుర్వాసన చికిత్స కారణంపై ఆధారపడి ఉంటుంది. రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడం, రోజుకు ఒకసారి ఫ్లాస్ చేయడం మరియు నాలుకను శుభ్రం చేయడం చాలా ముఖ్యం. దంతవైద్యుడిని క్రమం తప్పకుండా సందర్శించడం వల్ల దంత సమస్యలను ముందుగానే గుర్తించవచ్చు. ఎక్కువ నీరు త్రాగడం, చక్కెర లేని చూయింగ్ గమ్ నమలడం లేదా లాలాజల ప్రత్యామ్నాయాలను ఉపయోగించడం ద్వారా పొడి నోటిని నివారించవచ్చు. సమతుల్య ఆహారం తీసుకోవడం, ఉల్లిపాయలు, వెల్లుల్లి వంటి దుర్వాసన కలిగించే ఆహారాలను తగ్గించడం. పొగాకు ఉత్పత్తులను ఉపయోగించడం మానేయడం వల్ల నోటి దుర్వాసనను నివారించవచ్చు. అంతర్లీన ఆరోగ్య సమస్య ఉంటే, దానికి చికిత్స తీసుకోవడం అవసరం. నోటి దుర్వాసన ఒక సాధారణ సమస్య అయినప్పటికీ, ఇది మీ ఆత్మవిశ్వాసాన్ని మరియు సామాజిక జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. సరైన పరిశుభ్రత మరియు జీవనశైలి మార్పులతో దీనిని నివారించవచ్చు. ఒకవేళ సమస్య తీవ్రంగా ఉంటే, వైద్యుడిని సంప్రదించడం మంచిది.

## గర్భిణీ స్త్రీలు నదుల వద్దకు ఎందుకు వెళ్లకూడదో తెలుసా..?



గర్భిణులు నదుల వద్దకు వెళ్లవద్దని చెప్పడానికి పలు కారణాలు ఉన్నాయి. వీటిలో కొన్ని శాస్త్రీయమైనవి, మరికొన్ని సాంస్కృతిక విశ్వాసాల ఆధారంగా ఉంటాయి. శాస్త్రీయ కారణాలు: నదుల నీరు కలుషితమై ఉండే అవకాశం ఉంది. ఇందులో బ్యాక్టీరియా, వైరస్‌లు వంటి సూక్ష్మజీవులు ఉండవచ్చు. ఇవి గర్భిణీ స్త్రీలలో అంటువ్యాధులను కలిగించి, గర్భం దాల్చిన శిశువుకు హాని కలిగించవచ్చు.నదుల వద్ద తేమ ఎక్కువగా ఉంటుంది. చలికాలంలో నదుల వద్దకు వెళ్లడం వల్ల గర్భిణీ స్త్రీలకు జలుబు, దగ్గు వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది.నదుల వద్ద జారిపడడం, నీటిలో మునిగిపోవడం వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. గర్భిణీ స్త్రీల శరీరం సున్నితంగా ఉండటం వల్ల ఈ ప్రమాదాల వల్ల వారికి తీవ్రమైన గాయాలు అయ్యే అవకాశం ఉంటుంది. %ూశ్రీంశీ =ముఎ% " మొన్న అల్లు అర్జున్, ఇప్పుడు విక్టరీ వెంకటేష్: క్రిమినల్ కేసు నమోదు" సాంస్కృతిక విశ్వాసాలు: కొన్ని సంస్కృతులలో నీటిని దేవతగా భావిస్తారు. గర్భిణీ స్త్రీలు శుద్ధంగా ఉండాలని భావించి, వారిని నదుల వద్దకు వెళ్లనివ్వరు.కొన్ని ప్రాంతాలలో నదులను ప్రేతాల నివాసంగా భావిస్తారు. గర్భిణీ స్త్రీలు ప్రేతాల ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని భావించి, వారిని నదుల వద్దకు వెళ్లనివ్వరు. ముఖ్యమైన అంశాలు: గర్భిణీ స్త్రీలు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. వైద్యుల సలహాను పాటించాలి. శుభ్రమైన ప్రదేశాలలోనే తిరగాలి. ప్రమాదకరమైన పనులు చేయకూడదు.

# కాల్షియం, ఐరన్ లోపం ఉందా? అయితే ఇవి మీ డైట్‌లో చేర్చుకోండి!

రాగులు (ఫింగర్ మిల్లెట్) తృణధాన్యాల కుటుంబానికి చెందినవి. ఇవి ముఖ్యంగా భారతదేశం , ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలలో పండిస్తారు. రాగులు పోషకాలతో నిండి ఉన్నాయి. ముఖ్యంగా కాల్షియం, ఐరన్ , ఫైబర్ వీటిలో పుష్కలంగా ఉంటాయి. శరీరంలో కాల్షియం, ఐరన్ స్థాయిలను పెంచడానికి సహాయపడతాయి. వాటి పోషక విలువల కారణంగా, రాగులను ఆహారంలో చేర్చుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కాల్షియం – రాగులు: కాల్షియం మన శరీరానికి అత్యంత అవసరమైన ఖనిజాలలో ఒకటి. ఇది ఎముకలు మరియు దంతాలను బలంగా ఉంచడానికి, కండరాల సంకోచానికి, నరాల పనితీరుకు మరియు రక్తం గడ్డకట్టడానికి చాలా అవసరం. కాల్షియం ఎముకల నిర్మాణానికి మరియు వాటి బలానికి పునాది. తగినంత కాల్షియం లేకపోతే, ఎముకలు బలహీనపడి బోలు ఎముకల వ్యాధి వంటి సమస్యలు వస్తాయి. రాగులలో అధిక మొత్తంలో కాల్షియం ఉండటం వలన, వీటిని తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు మరియు గర్భిణీ స్త్రీలకు ఇది చాలా ముఖ్యం. ఇతర తృణధాన్యాలతో పోలిస్తే రాగులలో అత్యధిక కాల్షియం ఉంటుంది. 100 గ్రాముల రాగులలో సుమారు 344 మి.గ్రా కాల్షియం ఉంటుంది. ఇది పాలు , ఇతర పాల ఉత్పత్తులలో ఉండే కాల్షియంతో సమానం. రాగులలో ఉండే కాల్షియంను శరీరం సులభంగా గ్రహిస్తుంది. దీనిలో ఉండే ఇతర పోషకాలు కాల్షియం శోషణకు సహాయపడతాయి ఐరన్ – రాగులు: ఐరన్ మన శరీరానికి ఆక్సిజన్‌ను రవాణా చేయడానికి అవసరమైన ఒక ముఖ్యమైన ఖనిజం. ఇది




హిమోగ్లోబిన్ ఉత్పత్తికి అవసరం, ఇది ఎర్ర రక్త కణాలలో ఉండే ప్రోటీన్. ఐరన్ లోపం వల్ల రక్తహీనత వస్తుంది. దీని వల్ల అలసట, బలహీనత , శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు వస్తాయి. రాగులలో ఐరన్ పుష్కలంగా ఉండటం వలన, వీటిని తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చు. 100 గ్రాముల రాగులలో సుమారు 5 మి.గ్రా ఐరన్ ఉంటుంది. ఇది ఇతర తృణధాన్యాలతో పోలిస్తే చాలా ఎక్కువ. రాగులను విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలతో కలిపి తీసుకుంటే ఐరన్ శోషణ పెరుగుతుంది. ఉదాహరణకు, రాగుల జావను నిమ్మరసంతో కలిపి తీసుకోవచ్చు. రాగుల ఇతర ఆరోగ్య ప్రయోజనాలు: కాల్షియం ,ఐరన్‌తో పాటు, రాగులలో ఫైబర్, ప్రోటీన్ మరియు ఇతర పోషకాలు కూడా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. రాగులలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది మరియు మలబద్ధకాన్ని నివారిస్తుంది. రాగులలో ఉండే ఫైబర్ కడుపు నిండినట్లు ఉంచుతుంది, దీనివల్ల ఎక్కువ ఆహారం తీసుకోకుండా ఉంటారు. రాగులలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది, దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. రాగులలో ఉండే మెగ్నీషియం మరియు పొటాషియం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. రాగులను ఆహారంలో ఎలా చేర్చుకోవాలి? రాగులను వివిధ రకాలుగా ఆహారంలో చేర్చుకోవచ్చు. దీనిని జావ రూపంలో తీసుకోవచ్చు. ఇది చాలా సాధారణమైన మరియు ఆరోగ్యకరమైన వంటకం. రాగి సంగటి, రొట్టెలు, దోస, ఇడ్లీ, లడ్డురీలు, హల్వా, స్వీట్లు రూపంలో తీసుకోవచ్చు. రాగి సంగటి దక్షిణ భారతదేశంలో చాలా ప్రసిద్ధ వంటల్లో ఒకటి. గోధుమ పిండికి బదులుగా రాగుల పిండితో రొట్టెలు చేసుకోవచ్చు. రాగుల పిండితో దోసలు మరియు ఇడ్లీలు కూడా చేసుకోవచ్చు. రాగులు కాల్షియం , ఐరన్‌తో సహా అనేక పోషకాలతో నిండి ఉన్నాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి, రక్తహీనత నివారించబడుతుంది మరియు ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. కాబట్టి, రాగులను మీ ఆహారంలో ఒక భాగంగా చేర్చుకోండి మరియు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపండి

# బ్రెయిన్ స్ట్రోక్ - హార్ట్ ఎటాక్ మధ్య సంబంధం ఉందా

బ్రెయిన్ స్ట్రోక్ – హార్ట్ ఎటాక్ రెండూ ప్రాణాంతకమైన వైద్య పరిస్థితులు, ఇవి శరీరంలోని ముఖ్యమైన భాగాలకు రక్త ప్రవాహానికి ఆటంకం కలిగించినప్పుడు సంభవిస్తాయి. ఈ రెండింటి మధ్య కొన్ని ముఖ్యమైన పోలికలు ఉన్నప్పటికీ, వాటి మధ్య కొన్ని స్పష్టమైన తేడాలు ఉన్నాయి.

బ్రెయిన్ స్ట్రోక్:

బ్రెయిన్ స్ట్రోక్ అనేది మెదడుకు రక్త సరఫరా నిలిచిపోయినప్పుడు సంభవిస్తుంది. ఇది రక్తనాళం గడ్డకట్టడం (ఇస్కీమిక్ స్ట్రోక్) లేదా రక్తనాళం చిట్లడం (హెమోరేజిక్ స్ట్రోక్) వల్ల కావచ్చు. మెదడుకు ఆక్సిజన్ , పోషకాలు అందకపోవడం వల్ల మెదడు కణాలు చనిపోవడం ప్రారంభమవుతుంది. స్ట్రోక్ లక్షణాలు ప్రభావిత మెదడు ప్రాంతంపై ఆధారపడి ఉంటాయి . శరీరంలోని ఒక వైపు బలహీనత లేదా తిమ్మిరి, మాట్లాడటం లేదా అర్థం చేసుకోవడంలో ఇబ్బంది, దృష్టి సమస్యలు, సమన్వయ నష్టం మరియు తీవ్రమైన తలనొప్పి వంటివి ఉంటాయి.

**హార్ట్ ఎటాక్:**

హార్ట్ ఎటాక్ అనేది గుండెకు రక్త సరఫరా నిలిచిపోయినప్పుడు సంభవిస్తుంది, సాధారణంగా రక్తనాళంలో అడ్డంకి ఏర్పడటం వల్ల జరుగుతుంది. గుండె కండరాలకు ఆక్సిజన్ అందకపోవడం వల్ల గుండె కణాలు చనిపోవడం ప్రారంభమవుతుంది. హార్ట్ ఎటాక్ లక్షణాలు ఛాతీ నొప్పి లేదా అసౌకర్యం, ఇది



చేతులు, భుజాలు, వెన్ను లేదా దవడకు వ్యాపిస్తుంది, శ్వాస ఆడకపోవడం, వికారం, వాంతులు , మైకం వంటివి ఉంటాయి.

బ్రెయిన్ స్ట్రోక్ – హార్ట్ ఎటాక్ మధ్య **ముఖ్యమైన తేడాలు:**

బ్రెయిన్ స్ట్రోక్ మెదడును ప్రభావితం చేస్తుంది, అయితే హార్ట్ ఎటాక్ గుండెను ప్రభావితం చేస్తుంది. బ్రెయిన్ స్ట్రోక్ రక్తనాళం గడ్డకట్టడం లేదా చిట్లడం వల్ల సంభవిస్తుంది, అయితే హార్ట్ ఎటాక్ సాధారణంగా రక్తనాళంలో అడ్డంకి ఏర్పడటం వల్ల జరుగుతుంది. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు శరీరంలోని ఒక వైపు బలహీనత లేదా తిమ్మిరి, మాట్లాడటం లేదా అర్థం చేసుకోవడంలో ఇబ్బంది, దృష్టి సమస్యలు, సమన్వయ నష్టం , తీవ్రమైన తలనొప్పి వంటివి ఉంటాయి, అయితే హార్ట్ ఎటాక్ లక్షణాలు ఛాతీ నొప్పి లేదా అసౌకర్యం, శ్వాస ఆడకపోవడం, వికారం, వాంతులు , మైకం వంటివి ఉంటాయి. బ్రెయిన్ స్ట్రోక్ , హార్ట్ ఎటాక్ రెండూ తీవ్రమైన వైద్య పరిస్థితులు . తక్షణ వైద్య సహాయం అవసరం. మీరు లేదా మీకు తెలిసిన ఎవరైనా ఈ లక్షణాలను ఎదుర్కొంటుంటే, వెంటనే అత్యవసర సేవలను సంప్రదించండి.

### సంక్రాంతి పండుగ పిండివంటలు

# అతిగా తింటున్నారా? జాగ్రత్త!



సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఇంట్లోనూ పిండి వంటల హడావిడి కొనసాగుతుంది. ఇక పిండి వంటలు చేశారు కదా అని ఇష్టారాజ్యంగా నోరు కంట్రోల్ లేకుండా చాలామంది తింటూ ఉంటారు. అయితే పండుగ పిండి వంటల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏది పడితే అది ఎడాపెడా తింటే అనవసరమైన అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. పిండి వంటలు ఇష్టం వచ్చినట్టుగా తింటే రకరకాల అనారోగ్య సమస్యలు పండుగ సమయంలో చేసిన పిండి వంటలతో జాగ్రత్తగా ఉండాలని ఆ పిండి వంటలను కూడా సెలెక్టివ్ గా తినాలని మితంగా తినాలని సూచిస్తున్నారు వైద్యనిపుణులు. ఇష్టం వచ్చినట్టుగా తింటే రకరకాల అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నారు. కొన్ని పిండి వంటలు మన శరీరానికి కావలసిన శక్తిని ఇవ్వడంతో పాటు మన ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. అటు వంటి వాటిని తినడం మంచిది. ఇవి తినొచ్చు.. వీటి విషయంలో జాగ్రత్త ఉదాహరణకు సున్నుండలు, నువ్వుండలు, రాగి లడ్లు, పల్లి ఉండలు ఇవి మన శరీరానికి కావలసిన పోషకాలను అందిస్తాయి. ఇటువంటి వాటిని తినడం వల్ల పెద్దగా ప్రమాదం ఉండదు. కానీ చక్కెరతో తయారు చేసిన స్వీట్లు, బియ్యం పిండితో తయారుచేసిన పిండివంటలు మన శరీరంలో క్యాలరీలను అధికంగా పెంచుతాయి. కాబట్టి వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అతిగా తింటే జీర్ణ సమస్యలు ఇక ఇంట్లో పిండివంటలు ఉన్నాయని ప్లేట్లకు ప్లేట్లు తినకుండా మితంగా తినాలి. ఏదో కొద్దిగా టేస్ట్ చూసే నిమిత్తం తింటే పర్వాలేదు కానీ అదే పనిగా అతిగా తినడం వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. కనుక పిండి వంటలు తినే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎవరి ఇంటికి వెళ్లిన పిండివంటలను ఈ సమయంలో ఆఫర్ చేస్తారు. కాబట్టి అక్కడ కూడా మితంగా తినడం అలవాటు చేసుకోవాలి .తినే ఆహారంపైన ప్రత్యేక దృష్టి పెట్టారు కదా అని ఇష్టం వచ్చినట్టు తింటే అజీర్ణం సమస్య వచ్చి ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇక పండుగ సమయంలో పిండివంటలను ఎక్కువగా తినడం వల్ల బరువు పెరుగుతాము. బరువు పెరగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి.

# కుటుంబ కథా చిత్రాలకు అనువైన నటుడు శోభన్ బాబు

తెలుగు సినీ చరిత్రలో శోభన్ బాబు ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన తన అభినయంతో, అందమైన ముఖ కాంతితో, మధురమైన మాటలతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు. నటుడిగానే కాకుండా, మంచితనానికి మారుపేరుగా కూడా ఆయనకు గుర్తింపు ఉంది. శోభన్ బాబు అసలు పేరు ఉప్పలపు శోభనాచలపతి రావు. ఆయన 1937 జనవరి 14న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా చిన నందిగామలో జన్మించారు. చిన్ననాటి నుంచి నటనపై ఆసక్తి ఉన్న శోభన్ బాబు, తన విద్యలోనూ ఉత్తమ ప్రతిభను కనబరిచారు. మద్రాస్ క్రిస్టియన్ కాలేజ్‌లో విద్యాభ్యాసం పూర్తిచేసిన ఆయన, న్యాయవాదిగా పనిచేయాలని కలలు కన్నారు. అయితే సినిమా రంగంపై మక్కువ కారణంగా తన ప్రయాణాన్ని మారుస్తూ నటన రంగంలో అడుగు పెట్టారు. శోభన్ బాబు 1959లో "దైవ బలం" అనే సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశారు. అయితే ఆయనకు గుర్తింపు తెచ్చిన చిత్రం 1965లో వచ్చిన "మనుషులంతా ఒకటే". ఈ చిత్రం ద్వారా ఆయన తండ్రి పాత్రలు, ప్రేమిక పాత్రలు, కుటుంబ కథా చిత్రాలకు అనువైన నటుడిగా ప్రేక్షకుల హృదయాల్లో నిలిచారు. శోభన్ బాబు దాదాపు 200కి పైగా చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా కుటుంబ కథా చిత్రాల్లో ఆయన పాత్రలు సున్నితమైన భావోద్వేగాలను పండించాయి. ప్రేమ కథా చిత్రాలు, సాంఘిక చిత్రాలు, పౌరాణిక పాత్రలు ఇలా అన్ని విధాలుగా ఆయన తన ప్రతిభను చాటుకున్నారు. తన చిత్రాల్లో ఉన్న సహజత్వం, వినమ్రత, నిగర్వం ఆయన నటనకు ప్రత్యేకతను తెచ్చింది. ముఖ్యంగా "సోగ్గాడు", "మనవూరు పాండవులు", "కాలం మారింది", "జీవన తరంగాలు", వీరాభిమన్యు, "వాత్తేరు మొనగాడు" వంటి చిత్రాలు శోభన్ బాబును అగ్రహీరోగా నిలిపాయి. శోభన్ బాబు నిష్కల్మషమైన వ్యక్తిత్వానికి ప్రసిద్ధి. సినిమా రంగంలో ఉన్నప్పటికీ ఆయన ఎల్లప్పుడూ సాధారణ జీవన శైలిని అనుసరించారు. సహ నటులతో మంచి అనుబంధం కలిగి, నిరాడంబర వ్యక్తిగా గుర్తింపు పొందారు. సినిమాలకు సంబంధించిన వ్యవహారాలు పూర్తయిన తర్వాత ఎక్కువ సమయం తన కుటుంబానికి కేటాయించేవారు. సినిమా రంగానికి వీడ్కోలు



చెప్పిన తరువాత తన జీవితాన్ని పూర్తిగా కుటుంబానికి, ఆధ్యాత్మికతకు అంకితం చేశారు. శోభన్ బాబు తన నటనకు అనేక అవార్డులు పొందారు.
నంది అవార్డు ద్వారా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఉత్తమ నటుడిగా గుర్తింపు, ఉత్తమ నటుడిగా నాలుగుసార్లు ఫిల్మ్‌ఫేర్ అవార్డులను గెలుచుకున్నారు. భారత ప్రభుత్వం ద్వారా సినీ రంగానికి చేసిన సేవలకు ఆయనకు గౌరవం లభించింది. 2008 మార్చి 20న చెన్నైలో గుండెపోటుతో శోభన్ బాబు మరణించారు. ఆయన మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు. శోభన్ బాబు చిత్రాలు తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయి. ఆయన చిత్రాలు కుటుంబ విలువలు, అనుబంధాలను ప్రతిబింబించే చిత్రాలుగా నిలిచాయి. శోభన్ బాబు తెలుగు చిత్రసీమకు విలువైన ఆభరణం. ఆయన నటన, సౌమ్యమైన వ్యక్తిత్వం, జీవన విధానం ప్రతి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయి. శోభన్ బాబు వంటి నటుడు మళ్లీ పుట్టడం అరుదు.

# ప్రతిభా శాలియైన ఆర్థిక వేత్త సి.డి.దేశ్‌ముఖ్

సి.డి.దేశ్‌ముఖ్ (జనవరి 14, 1896 – అక్టోబరు 2, 1982) పూర్తి పేరు చింతమన్ ద్వారకానాథ్ దేశ్‌ముఖ్ స్వతంత్ర భారత దేశపు తొలి రిజర్వ్ గవర్నర్‌గా నియమితులైన తొలి భారతీయుడిగా సిడి దేశ్‌ముఖ్‌ను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. భారతీయ నాటి కరెన్సీపై సిడి దేశ్ ముఖ్ సంతకాన్ని చూడవచ్చు. భారతీయ రిజర్వ్ బాంక్ మూడవ గవర్నర్, 1943, ఆగష్టు 11 నుంచి 1949, జూన్ 30 వరకు ఈ పదవిని నిర్వహించారు. ఆ తర్వాత దేశ్‌ముఖ్ భారత దేశానికి ఆర్థిక మంత్రిగా నియమితులైనారు. అంతర్జాతీయ ద్రవ్యనిధిలో సంవత్సరానికి 30వేల డాలర్ల వేతనం కాదని దేశసేవకే తన జీవితాన్ని ఆయన అంకితం చేసిన గొప్ప సామాజిక సేవకుడు. ప్లానింగ్ కమిటీ సభ్యుడుగా ఉంటూనే ఆర్థికమంత్రిగా ఉన్నా ప్రతిభాశాలి. బొంబాయి నగరాన్ని కేంద్రం అధీనంలో ఉంచడం ఇష్టపడక దేశ్‌ముఖ్ మంత్రి పదవికి రాజీనామా చేసిన నిబద్ధత కలిగిన రాజకీయ నాయకులు. భారత ఆర్థికమంత్రులలో సి.డి. దేశ్‌ముఖ్ అత్యంత ప్రతిభావంతుడు. ఆయన హయాంలో దేశంలో విదేశీ మారక కొరతలేదు. లోటు బడ్జెటు ప్రస్తావన రాలేదు. ద్రవ్యోల్బణం రేటు వెర్రితలలు వేయలేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో మన రూపాయి విలువ తగ్గలేదు. ఇండియన్ సివిల్ సర్వీస్ సభ్యుడైన దేశ్‌ముఖ్ కు 1939 నుంచే రిజర్వ్ బ్యాంక్తో సంబంధం ఉంది. 1941లో రిజర్వ్ బ్యాంక్ డిప్యూటి గవర్నర్ గా నియమించ బడ్డారు. 1943లో. ఆ తర్వాత జేమ్స్ టేలర్ నుంచి 3 వ గవర్నర్ గా బాధ్యతలు తీసుకున్నారు. దేశ్‌ముఖ్ గవర్నర్‌గా ఉన్న సమయంలో ప్రపంచంలో ముఖ్యమైన ఆర్థిక పరిణామాలు సంభవించాయి. 1943లో రిజర్వు బ్యాంకు గవర్నర్ టెయిలర్ మరణించగా, డిప్యూటీ గవర్నరుగా ఉన్న సి.డి. దేశ్‌ముఖ్‌ని ఏకగ్రీవంగా గవర్నరుగా ఎన్నుకున్నారు. రిజర్వు బ్యాంక్ గవర్నరుగా దేశ్‌ముఖ్ దేశానికి ఎంతో సేవ చేశారు. జూలై 1944లో జరిగిన బ్రెట్టన్ వుడ్స్ సమావేశంలో అతడు కూడా భారత దేశం తరఫునన పాల్గొన్నారు. ఈ సమావేశమే అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (%×వీభీ%), ప్రపంచ బ్యాంకు (%శ్రీ×దీ=ణ%) ఏర్పడడానికి కారణమైంది. ఈ రెండు సంస్థల లోనూ దేశ్‌ముఖ్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ గా పదేళ్ళ పాటు పనిచేశారు. 1950లో పారిస్లో జరిగిన ఈ రెండు సంస్థల వార్షిక సంయుక్త సమావేశంలో ఇతడు ఛైర్మెన్ గా వ్యవహరించారు. 1945లో సిమ్లా సమావేశంలో వైస్రాయ్ సభ సభ్యులంతా భారతీయులే ఉండాలని తీర్మానించారు. ఆ జాబితాలో ఆర్థిక సభ్యుడుగా దేశ్‌ముఖ్ పేరు వేయాలని ప్రయత్నించారు. కానీ దేశ్‌ముఖ్ తనకు రాజకీయాలు పడవని తప్పించు కున్నారు. 1950లో ప్లానింగ్ కమిషన్ ఏర్పడింది. ఆ బాధ్యత దేశ్‌ముఖ్ మీద పడింది. అదే సంవత్సరం డా. జాన్ మత్తయ్ ఆర్థికమంత్రిగా రాజీనామా ఇచ్చినప్పుడు దేశ్‌ముఖ్ ఆ స్థానం పొందారు. ప్లానింగ్ కమిటీ సభ్యుడుగా ఉంటూనే ఆర్థికమంత్రిగా ఉన్నారు. 1953 జనవరి 22న దేశ్‌ముఖ్ వివాహం దుర్గాబాయి తో జరిగింది. అది దేశంలో గొప్ప సంచలనం సృష్టించింది. వారి పెళ్లిపత్రంపై నెహ్రూ, కృపలానీ దంపతులు సాక్షులుగా సంతకాలు చేశారు. దుర్గాబాయ్‌తో వివాహం జరిగిన తర్వాత మొదటి జన్మదినాన్ని ఆయన తన ఇంట్లో చాలా నిరాడంబరంగా జరుపు కున్నారు. ఈ సంగతి నెహ్రూకు తెలిసి, తీరిక చేసుకొని నెహ్రూ వాళ్ల ఇంటికి వెళ్లారట. 'ఏం దుర్గాబాయ్! దేశ్‌ముఖ్ నీ భర్తే కావచ్చు.. నా క్యాబినెట్ మంత్రి సుమా!' అని చమత్కరించారట. ఆ దంపతులు ఇచ్చిన టీ బిస్కెట్ తీసుకుని నెహ్రూ మందహాసంతో వెళ్లిపోయారట. ఇలాంటి ఆప్యాయత ఈ రోజుల్లో కనిపించడం అరుదు. తన నియోజకవర్గం ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా బొంబాయి నగరాన్ని కేంద్రం అధీనంలో ఉంచడం ఇష్టపడక దేశ్‌ముఖ్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆయన ఢిల్లీ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా ఆరేళ్లు చేశారు. అప్పటికే దేశ్‌ముఖ్ దంపతులు సంక్షేమ కార్యక్రమాలను దేశమంతా విస్తరించి ఉన్నారు. సంవత్సరానికి 30వేల డాలర్ల వేతనం కాదని దేశసేవకే తన జీవితాన్ని ఆయన అంకితం చేశారు.

# హాస్య రస గుళికలు... జంధ్యాల రచనలు



జంధ్యాల వీర వెంకట దుర్గా శివ సుబ్ర హ్మణ్య శాస్త్రి. ఈ పేరు తెలుగు ప్రజల కు దాదాపు తెలియ దనే చెప్పాలి. కనీసం ఆ పేరు గల వ్యక్తి ఉన్నారని గాని, ఆయన సుపరిచితు లేనని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని, అత్యంత ప్రజా దరణ పొందిన విజయ వంతమైన సినిమాలకు కథలు, ఆకట్టుకునే సంభా షణలు సమకూ ర్చారని, చిర కాలం గుర్తుండి పోయే చిత్రాలకు దర్శకత్వం వహించారని సినిమాలతో పరిచయం, సంబంధం ఉన్నా చాలా మందికి తెలియదు. ఆయనే.. హాస్యబ్రహ్మగా పేరు పొంది, ఇంటి పేరుతో ప్రఖ్యాతి గాంచిన వెండితెర హాస్య బ్రహ్మ జంధ్యాల. జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి (జనవరి 14, 1951 – జూన్ 19, 2001 ) తెలుగు సినిమా రచయిత, దర్శకులు. జంధ్యాల అని ఇంటి పేరు తోటే సుప్రసిద్ధుడైన ఆయన అసలుపేరు జంధ్యాల వీర వెంకట దుర్గా శివ సుబ్రహ్మణ్య శాస్త్రి. ప్రత్యేకించి హాస్యకథా చిత్రాలు తీయ టంలో ఆయనది అందె వేసిన చెయ్యి. జంధ్యాల చెప్పిన ప్రసిద్ధ వాక్యం – నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వక పోవడం ఒక రోగం. అనేది నానుడి. జంధ్యాల 1951 జనవరి 14 న పశ్చిమ గోదావరి జిల్లా నరసా పురంలో జన్మించాడు. బి.కామ్ వరకు చదువు కున్నారు. చిన్న తనం నుండి నాటకాల పట్ల ఆసక్తి గా ఉండేవారు. స్వయంగా నాటకా లు రచించారు. ఆయన రాసిన నాటకాల్లో "ఏక్ దిన్ కా సుల్తాన్, గుండెలు మార్చబడును" ప్రముఖ మైనవి. ఆయన నాటకాలు అనేక బహుమతులు అందుకున్నాయి. 1974లో జంధ్యాల సినిమా రంగ ప్రవేశం చేసారు. శంకరాభరణం, సాగర సంగమం, అడవి రాముడు, వేటగాడు వంటి అనేక విజయ వంతమైన సినిమాలకు మాటలు రాశారు. ముద్ద మందారం సినిమా తో దర్శకుడిగా మారి, శ్రీవారికి ప్రేమలేఖ వంటి చిరస్మరణీయ చిత్రాన్ని సృజించారు. 1976 లో దేవుడు చేసిన బొమ్మలు చిత్రం ద్వారా మాటల రచయితగా తన సినిమా జీవితం మొదలు పెట్టారు. ఐదేళ్ళలో సుమారు 85 సినిమాలకు రచయితగా పని చేయగా అందులో 80 శాతం సినిమాలు ఘనవిజయం సాధిం చడంతో మంచి రచయితగా పేరు తెచ్చుకున్నారు. తరువాత దర్శకు డిగా మారి, అనేక హాస్య చిత్రాలను రూపొందించారు. ఆరోగ్య కరమైన హాస్యానికి జంధ్యాల పేరు గాంచారు. హాస్యబ్రహ్మ అని పేరు పొందారు. రచయితగా 300కు పైగా సినిమాలు, దర్శకుడు గా షుమారు 50 సినిమాలు చేసారు. అప్పటి కామెడీ హీరోలకు లైఫ్ ఇచ్చాయి ఈయన సినిమాలు. ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించారు. శ్రీలక్ష్మి, బ్రహ్మానందం లాంటి వారిని ఈ రోజుకి ప్రేక్షకులు గుర్తుంచు కున్నారంటే ఆయన సినిమాలే కారణమనేది వాస్తవం. జంధ్యాల కేవలం హాస్యమే కాకుండా అన్ని రకాల ఎమోషన్స్ రచించే వారు. అజరామర 'శంకరా భరణం' చిత్రంతో పాటు 'సప్తపది' జంధ్యాల రచనకు తార్కాణాలుగా నిలిచాయి. సినిమా పరిశ్రమలో జంధ్యాల, కె.రాఘవేంద్రరావుల కాంబినేషన్ కు విశేష ప్రత్యేకత ఉంది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'అడవి రాముడు', 'వేట గాడు', 'డ్రైవర్ రాముడు', 'జగదేక వీరుడు అతిలోక సుందరి' వంటి చిత్రాలను జన రంజకంగా రూపొం దించడంలో జంధ్యాల పాత్ర కీలకంగా నిలిచింది. అలాగే కె.విశ్వ నాథ్, జంధ్యాల కాంబినేషన్ కూడా సూపర్‌హిట్ చిత్రాలకు పెట్టింది పేరు. ఈ కాంబినేషన్‌లో 'శంకరా భరణం', 'సాగర సంగమం' వంటి చిత్రాలొచ్చాయి. దర్శకుడుగా ఆయన మొదటి సినిమా ముద్ద మందారం ఈరోజుకి అంత ఆదరణ పొందుతోంది అంటే ఆయన దర్శ కత్వ ప్రతిభే. కామెడీ చిత్రాలకు ఎక్కువగా పని చేసిన జంధ్యాల వేగవంతమైన రచయితగా పేరు తెచ్చు కున్నారు. పది రోజుల్లో సినిమాకు మాటలు రాసేవారు. ఆయన కళాత్మక చిత్రా లకు ఎంత హృద్యంగా రాశారో, హాస్య భరిత చిత్రాలకు అంత చిలిపిగా రాశారు. 1983లో, "ఆనంద భైరవి" చిత్రానికి ఉత్తమ ప్రాంతీయ చిత్రం దర్శకుడు జాతీయ అవార్డు, 1983లో, "ఆనంద భైరవి" చిత్రానికి ఉత్తమ దర్శకుడు నంది అవార్డు, 1987లో, "పడమటి సంధ్యారాగం" చిత్రానికి ఉత్తమ కథారచయిత అవార్డు, 1992లో, "ఆపద్బాంధవుడు" చిత్రానికి ఉత్తమ మాటల రచయిత అవార్డు లభించాయి. జంధ్యాల తన సినిమాల ద్వారా అనేక మంది నటులను... బ్రహ్మా నందం, నరేష్, ప్రదీప్, సుత్తి వీరభద్రరావు, సుత్తి వేలు తదితర నటీనటులను జంధ్యాల సినీ రంగానికి పరిచయం చేశారు. ఇంటి పేరు తోటే ప్రసిద్ధుడైన జంధ్యాలను మీ అసలు పేరు ఏమిటి అని అడిగితే ఆయన ఇలా అనేవాడు: "నేను రామానాయుడి సినిమాకు పనిచేసేటపుడు నాపేరు జంధ్యాల రామానాయుడు, విశ్వనాథ్ గారి సినిమాకు పనిచేసే టపుడు నా పేరు జంధ్యాల విశ్వనాథ్"... అలా అనేవారు తప్ప, తన అసలుపేరు ఎక్కడా చెప్పు కోలేదు. జంధ్యాల 2001 జూన్ 19 న హైదరాబాదులో గుండె పోటుతో మరణించారు. ఆయనకు ఇద్దరు కూతుర్లు.... పేర్లు సాహితి, సంపద.

# తెలుగు సంస్కృతికి ప్రతీక సంక్రాంతి పండుగ

యుగయుగాలుగా, తరతరాలుగా అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తున్న క్షీర ధార హైందవ సంస్కృతి. ఆ పాల వెల్లువలో పెల్లుబికిన మీగడ తరగలే మన సాంప్రదాయాలు. హైందవ సంస్కృతీ సంప్రదాయాలకు, ఆచారాలకు "పండగ కేంద్ర బిందువు, పండుగలు శుభ సూచకాలు. ప్రతి కుటుంబంలో కష్ట నష్టాలను మరపించి, నూతనోత్సాహాన్ని కలిగిస్తాయి. పండగలు పురాణేతిహాస, రుతు సంబంధాలు, శీతోష్ణ స్థితుల, సామాజిక జీవన విధానాధారాలుగా ఏర్పడ్డాయి. ప్రతి పండగలో పరమార్థం ఉన్నందునే అవి సాంప్రదాయాలుగా మారాయి. డోలు సన్నాయి వాద్యాలు, వాటి రాగాలకు అనుగుణంగా విన్యాసాలు చేసే అలంకృత గంగిరెద్దులు, హరిలో రంగ హరీ అంటూ, నడినెత్తి నుండి నాసిక దాకా తిరుమణి శ్రీచూర్ణ పట్టెలతో, కంచు గజ్జెలు ఘల్లు ఘల్లుమనగా, బోడి తలపై రాగి అక్షయపాత్ర కదల కుండా, చిందులు తొక్కే హరిదాసులు, అడుగడు గునా ముంగిళ్లలో రంగుల ఆకృతులు, భోగిమం టలు, కొన్ని ప్రాంతాలలో కోడి పందాలు, బొమ్మల పండుగలతో కలబోసిన గ్రామీణ సుందర మనో హర దృశ్యాలు తెలుగు వారికే ప్రత్యేకమైన సాంప్ర దాయ ప్రతీకలు. చాంద్రమానం" పాటించే తెలుగువారు "సౌరమానం" ప్రకారం జరిపే పండుగ సంక్రాంతి", "తత్ర మేషాదిషు ద్వాదశ రాశి క్రమ కేశు సంచరత: సూర్యస్య పూర్వస్మాద్రాశే ఉత్తర: రాశౌ సంక్రమణ ప్రవేశ: సంక్రాంతి". మేషం మొదలైన 12 రాశులలో సంచరించే సూర్యుడు ముందున్న రాశి నుండి తరువాతి రాశిలోనికి ప్రవేశించడమే సంక్రాంతి.సంక్రాంతి అంటే మారడం, చేరడం అని అర్థం. కర్కాటకం నుంచి మకర సంక్రాంతి వరకు సూర్యుడు దక్షిణాభి ముఖంగా సంచరించడం వల్ల ఈ కాలాన్ని 'దక్షిణాయణం' అంటారు. మకర సంక్రాంతి నుంచి కర్కాటక సంక్రాంతి వరకు ఉత్తరాభి ముఖుడై సంచరించడం వల్ల ఈ కాలాన్ని 'ఉత్తరాయణం' అని అంటారు. దేవతలకు ఉత్తరాయణం ఉత్తమ కాలమని, దక్షిణాయణం పితృదేవతలకు ముఖ్య కాలమని భావిస్తారు. ఉత్తరాయణంలో మరణిస్తే మోక్షప్రాప్తి కలుగు తుందంటారు. అందుకే అంపశయ్యపై భీష్మాచార్యుడు ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చే వరకు వేచి ఉన్నాడని మహా భారతం చెబుతోంది.. మూడు రోజుల పాటు జరుపుకునే సంక్రాంతి సంబరాలలో మొదటిది భోగి పండగ. ఇతర పండుగల వలె తిథి ప్రధానము అయినది కాదు. ఇది ధనుర్మాసానికి, దక్షిణాయనానికి ఆఖరు రోజు. మకర సంక్రమణానికి పూర్వపు రోజు. గోదాదేవి తిరుప్పావై రచన పూర్తి చేసిన ముప్పయవ నాడు రంగ నాథుడు ప్రత్యక్షమై అమెను వివాహమాడతానని, సకల భోగాలు సమకూరుస్తానని చెప్పి, వివాహమాడగా, వివాహ తంతు పూర్తికాగానే ఆమె స్వామి వారిలో ఐక్యం పొందుతుంది. అందుకే "భోగి" అని ఈ పర్వమానికి పేరు. జన సామాన్యానికి భోగ భాగ్యాలు ఇచ్చే రోజని ప్రతీతి. భోగినాడు మేఘాధిపతి యైన ఇంద్రపూజు చేయడం ఆనవాయితీ. బలి చక్రవర్తి అణగిన దినంగా చెపుతారు. భోగి నాడు భోగి పీడ నివారణ, తెల్లవారగనే అభ్యంగన స్నానం చేయడం, విధాయక కృత్యం. చంటిపిల్లలకు తలంటు పోసి, భోగి పళ్ళు పోయడంతో దృష్టి పరిహారం చేస్తారు. కొత్త బట్టలు కట్టి, కుర్చీలో కూర్చుండ చేసి, రేగు పళ్ళు, పైసలు, చెరుకు ముక్కలు, బోడికలు దిగువార బోస్తారు. ధనుర్మాసం నెల రోజులు ఆడపిల్లలు తయారు చేసిన గొబ్బి పిడకలు చేయడం, తెల్లవారగట్లు భోగిమంటలు చేయడం ఆచరిస్తారు. మకర సంక్రాంతి సూర్యుడు ఉత్తర గతుడు కావడం త ఉత్తరాయణ ప్రవేశమవుతుంది. ఉత్తరాయణం దేవతలకు అర్హమైన కాలం, ఈ అయనంలో మృతి చెందిన వారు పుణ్యాత్ములై, సూర్య సాయుజ్యం పొందగలరని వేద వచనం. సూర్య సంచారమును బట్టి ఏర్పడిన పండుగ. ఆడపిల్లలు తెల్లవారు జామున లేచి పెట్టే గొబ్బిల్లు, ఆర్ష కర్మలలో ప్రాముఖ్యం కలిగిన కళాభిజ్ఞత ఉట్టిపడే ముగ్గులు, పళ్ళ నైవేద్యాలు, బాజా భజంత్రీల వాద్యాలు, ఎక్కడ చూసినా ఈనాడు దర్శనమిస్తాయి. రెండవ నాడు జరిపే మకర సంక్రాంతి అత్యంత పురాతనమైనది. సంక్రాంతి నాడు గంగలో స్నానం చేసి, బ్రాహ్మణునికి పెరుగు దానం చేయాలనే నియమాన్ని పాటించిన యశోదకు కృష్ణుడు జన్మించాడని దుర్వాసముని ద్వారా వివరింపబడి, ఆయన సూచనపై ద్రోణాచార్యుని సతి కృపి, సంక్రాంతి పర్వాన్ని జరిపి, పెరుగు దానం చేయడం ద్వారా అశ్వత్థామకు జన్మనిచ్చినట్లు పురాణ కథనం. ఈ సందర్భంగా నువ్వుల ముద్దలతో నలుగు పెట్టుకుని, తలంటి స్నానాలు చేసిన ముత్తయిదువలు, అలంకృతులై, ఐదు మట్టి ముంతలు పుచ్చుకుని, ఒక్కొక్క ముంతలో బియ్యం, పప్పు దినుసులు, చెరుకు, క్యాబేజీ ముక్కలు, రేగుపళ్ళు, నువ్వులు ఉంచి, మూకుడు మూతతో ఉంచి, ఎరిగిన వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి ఇస్తారు.



నువ్వులతో చేసిన భక్ష్యాలతో భోజనం చేస్తారు. చిన్నపిల్లలకు మిఠాయి ఉండలు, రేగు పళ్ళు పంచుతారు.మకర సంక్రాంతినాడు రాముని పూజచేసి ఉపవాసం ఉండాలని చతుర్వర్గ చింతామణిలో ఉంది. ఈనాడు సూర్యుని ఆరాధించి, తిలలు, కూష్మాండాలు, భాండాలు, కంబళి, ధా న్యాలు, లోహాలు, వస్త్రాలు, తైల దీపాలను దానం చేయాలని శాస్త్ర వచనం. భోజనానికి బంధు మిత్రులను ఆహ్వానించడం, నగలతో అలంకరించుకుని నూతన వస్త్ర ధారణ గావించిన ముత్తయిదువలు పంచదారలో నువ్వులు కలిపి చిమ్మిలి చేసి, పంచి పెడతారు. సంవత్సరం పొడువునా, స్నేహితులై ఉండాలని ఆకాంక్షిస్తూ, శుభ, సుఖ ప్రదం కావాలని దీవనలను పెద్దవారి నుండి పొందడం ఆచారం. ఇక చివరిది కనుము పండుగ. అధర్వణ వేదంలో దీనిని వృషభోత్సవమని పేర్కొన్నారు. ముందు సంక్రమణం పెళ్ళిన మరువాడు పశువులకు చేసే పండగ ఇది. కనుమ నాడు మినుములు తినాలట..కనుమనాడు మినుములు తినాలని, లేకపోతే యముడు ఇనుము కొరికిస్తాడని పెద్దలు అంటారు. కొన్ని ప్రాంతాల్లో కనుమనాడు తమ గ్రామ దేవతలకు నైవేద్యాలను సమర్పించే ఆచారం ఉంది. పురుషులు గ్రామ పొలిమేరల్లో కోడి పందాలు, పొట్టేళ్ల పందేలు జరుపుతారు..కనుమ రోజున ప్రయాణం పెట్టుకో కూడదని అంటారు. వెళ్తే వెంటనే తిరిగి రావడం కుదరదని ప్రతీతి. కనుమ నాడు కాకి కూడా ఎక్కడకీ బయల్దేరదనే సామెత. కనుమునాడు గోపూజ చేయడం కొన్ని చోట్ల కనిపి స్తుంది. ఆవులను, దూడలను, ఎద్లను, శుభ్రంగా కడిగి, కొమ్ము లకు ముఖానికి పసుపు రాచి, కుంకుమ పెడతారు. అలంకరణార్థం కుచ్చులు, కొత్త కట్టు తాళ్ళు పెడతాడు. వీధుల వెంట ఊరే గిస్తారు. పశువుల శాలలను శుభ్రపరిచి మామిడాకులు కట్టి, పూలతో అలంకరిస్తారు. సాయం కాలం పొంగిలి నైవేద్యాన్ని పశువుల శాల వద్ద పెడతాడు. పవిత్రోదకం చల్లుతారు. పంటలు పండించే భగవంతునికి పొలాలను దున్నే ఎద్దులకు కృతజ్ఞత తెలిపే పర్వం సంక్రాంతి యనడంలో ఎలాంటి సందేహం లేదు. తెలుగు వారికి ఇష్టమైన సంక్రాంతి సంబరాలకు తెలుగు నేల సిద్ధమవుతున్నది.

# తెలుగు వారి ముంగిళ్ళలో ముగ్గులు




శుచిత్వం, ఆచారం, అలంకార ప్రియత్వం, కళా ప్రదర్శనం, ఆరా ధనా విధానానికి సంకేతాలు రంగవ ల్లులు. శుభ్రంగా ఊడ్చి, కళ్ళాపు చల్లి ముంగులతో అలంకృతాలయ్యే తెలుగునాట ముంగిళ్ళు తరతరాల వారసత్వ సంస్కృతులకు ప్రతిబింబాలు. ముగ్గు లేదా రంగవల్లి ఇంటి వాకిలి, ఇంటి లోపలా అందంగా అలంకరించు ప్రాచీన కాలం నుండి వస్తున్న సాంప్రదాయం. తెలుగు సీమల్లో ప్రతి ఇంటి లోగిళ్లలో ముగ్గులు వేయడం అనాదిగా వస్తున్న సాంప్రదాయాలు. ఇవి ముగ్గు పిండితో వేస్తారు. ఇంటి ముందు పేడ నీటితో కళ్ళాపి జల్లి తడిగా ఉండగానే ఈ పిండితో ముగ్గులు సాధారణంగా స్త్రీలు వేస్తారు. ముగ్గు అనగా తెల్లగా ఉండే ఒక రకమైన పిండి. సాధారణంగా ముగ్గులు పెట్టేది మామూలు పిండితో, తరువాత బట్టీల ద్వారా, నత్తగుల్లలు, ముగ్గు రాళ్ళతో ముగ్గును తయారు చేయడంతో దానిని అధికంగా వాడుతున్నారు. సంక్రాంతికి ముగులను పిండితో వేయడం ప్రాచీన ఆచారం. అయితే ధనుర్మాస యుక్త సంక్రాంతి సంబంధిత పర్వదినాలలో వేసే ముగ్గులు పలువిధ ప్రత్యేకాలు. చుక్కలు పెట్టి, హద్దులు ఏర్పరచి, గీతలను సున్నితంగా కలపడంలో, మెలికలు తిప్పడంలో, కళానైపుణ్యాలు ప్రదర్శితాలవుతాయి. సర్వ సంపదలకూ అధిష్టాన దేవతయైన అష్టలక్ష్మికి ఇంటి తల వాకిట పీఠం వేయ బడుతుంది. కనుమ నాడు వాకిళ్ళను మూసేసే ముగ్గు కూడా వేసి, లక్ష్మీ దేవిని బయటకు వెళ్ళనీయకుండా వాకిళ్ళను మూసివేసే ముగ్గులు పెడతారు. నెమళ్ళు, హంసలు, రామ చిలుకలు, గరుత్మంతులు, మత్స్య కూర్మాది అవతారాలు, అందానికి, ప్రయోజకత్వానికి, మెలికలు తిప్పడంలో కళాభిజ్ఞతను తెలియ జేస్తాయి. స్వర్గ ద్వారాలు తెరిచి ఉంచే ముగ్గు, గుమ్మడి పండు ముగ్గు, సూర్య రథాల ముగ్గు, చుక్కల రథాల ముగ్గు ఉత్తరాయణంలో ప్రత్యక్ష దైవమైన సూర్య గమనాన్ని సూచించే ముగ్గులు. ముగ్గులలో గణిత శాస్త్ర సంబంధిత కోణాలు, త్రిభుజాలు, చతుర్భుజాలు, త్రికోణాలు, దీర్ఘ చతురస్రాలు, అష్ట కోణాలు, సమాంతర రేఖలు చోటు చేసుకుంటాయి. రాళ్లు రప్పలూ లేకుండా ముంగిట అలంకబడిన నేల...మేఘాలు లేని గగనతలం... అందలి చుక్కలు, రాత్రి వేళల కానవచ్చే నక్షత్రాలు, చుక్కల చుట్టూ తిరుగుతూ గళ్ళల్లో చుక్కలను పదిల పరిచే ముగ్గులు ఆకాశంలో కనిపించే మార్పులకు సంకేతాలు. ముగ్గు మధ్యలో చుక్క అనాదిగా సూర్య కేంద్రక సిద్ధాంతానికి ఆధార భూతమైన సూర్య స్థానానికి సంకేతం. గీతలు స్థిత శక్తికి, చుక్కలు గతి శక్తికి సంకే తాలని, ముగ్గులు శ్రీచక్ర సమర్పణా సంకేతాలని తత్వవేత్తల భావన. విల్లు ధనుర్రాశికి, ప్రతీక అయినట్లు మేక, ఎద్దు, సింహం, పీత, చేప లాంటివి నవ గ్రహాలకు గుర్తులుగా ముగ్గులు వేస్తారు. భూమికి ఉన్న దక్షిణ దిక్కులో దక్షిణ ధృవం ఉంటుంది. దాని నుండి వచ్చే అయ స్కాంత శక్తులనే... పిశాచాలు, రాక్ష సులు అని ప్రాచీనులు చెప్పేవారు. పాములు కూడా దక్షిణ దిశనే ఎక్కు వగా సంచరిస్తుంటాయి. అవి ఇళ్ళ ల్లోకి ప్రవేశించనీయ కుండా వాకిలి ముందు ముగ్గులు వేయడం, అవి బియ్యపు పిండితో వేయడం అత్యంత ప్రాచీన కాలం నుండి ఉంది. ఇంటి ముందున్న పిండి తిని ఇళ్లల్లోకి రాకూడదనే భావన ఇందులో ఇమిడి ఉంది. మూడు రోజులు బంధుగణ సమేతులై ఆనందోత్సాహాలు పంచుకున్న అనంతరం పండగను సాగనంపేందు కే రథం ముగ్గు వేస్తారు. అందరూ ఒకరికి ఒకరు తోడుగా, కలసి మెలసి సహజీవనం గడపాలనేదే ఒక ఇంటి రథం తాడును, పక్క ఇంటి రథం ముగ్గుతో కలిపే రథం వెనక ఉన్న భావం.

